ప్రజాశక్తి

సోమవారం 17 ఫిబ్రవరి 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

జనం సొమ్ముతో జల్సాలు



ఇటీవల ఒక వ్యాపారి మోసంపై నరసరావుపేటలో న్యాయం కోసం ర్యాలీ చేస్తున్న బాధితులు

- పెరుగుతున్న ఆర్థిక నేరగాళ్లు
- ఆకర్షణీయ ప్రకటనలతో సామాన్యులకు కుచ్చుటోపి
- గుంటూరు,నర్సరావుపేటలో భారీగా ఐపిలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఆర్థిక మోసగాళ్ల సంఖ్య పెరుగుతోంది. ఏటా 100కి పైగా ఆర్థిక మోసాలకు సంబంధించిన నేరాలు నమోదవుతున్నాయి. చిట్‌ఫండ్స్‌, రియల్‌ ఎస్టేట్‌ తదితర మార్గాల్లో పెట్టుబడి పెడితే అధిక సొమ్మువస్తుందని ఆశచూపి జనంతో వ్యాపారులు చెలగాటమాడుతున్నారు. ఆకర్షణీయ ప్రకటనలతో భారీగా సొమ్ములు వసూలు చేసి బోర్డులు తిప్పేస్తున్నారు. తాజాగా నరసరావుపేటలో సాయిసాధన చిట్‌ఫండ్స్‌ యజమాని పాలడుగు పుల్లారావు వందలాది మందిని మోసం చేశారు. పుల్లారావు ఇటీవల బోర్డు తిప్పేసిన ఘటన మరువక ముందే ఆయన భాగస్వామి, రియల్టర్‌ జి.సాంబశివరావు కూడా వారం నుంచి అజ్ఞాతంలోకి వెళ్లారు. ఆయన ఫోన్‌ స్విచ్ఛాఫ్‌ చేసి కన్పించకుండా పోవడంతో ఆయనతో ఆర్థిక లావాదేవీలు చేసిన అనేక మంది ఆందోళనకు గురవుతున్నారు.

పుల్లారావుపై గుంటూరు, నరసరావుపేటలో ఇప్పటికే పలు కేసులు నమోదయ్యాయి. పుల్లారావును అరెస్టుచేయగా ఆయనకు కోర్టు రిమాండ్‌ విధించింది. పుల్లారావు దాదాపు దాదాపు 200 మందికి రూ.108 కోట్లు చెల్లించాలని బాధితులు ఒక న్యాయవాది సమక్షంలో నిర్ధారణకు వచ్చారు. అయితే ఆయన ఆస్తులను జప్తు చేయించేందుకు ప్రయత్నించిన న్యాయవాది వాటి విలువ రూ.90 కోట్లుగా తేల్చారు. అయితే వీటిని ఇప్పటికిప్పుడు అమ్మి బాధితులకు చెల్లించే అవకాశం ఉందా? లేదా? అనే అంశం న్యాయపరంగా అనేక చిక్కులతో ముడిపడి ఉందని చెబుతున్నారు. నరసరావుపేట, గుంటూరు, సత్తెనపల్లి, తెనాలి తదితర ప్రాంతాల్లో వివిధ లావాదేవీల్లో ప్రజలకు కోట్లాది రూపాయిలు చెల్లించాల్సి ఉండగా ఐపి పెట్టి కోర్టులో పిటీషన్లు దాఖలు చేసి తాత్కాలికంగా తప్పించుకుంటున్నారు. గుంటూరులో ధాన్యం, అపరాలు, మిర్చి, పత్తి రైతులకు, చిన్న వ్యాపారులకు దాదాపు 30 మంది వరకు బడా వ్యాపారులు ఐపి పెట్టినట్లు కేసులున్నాయి. నరసరావుపేటలో మెడికల్‌ డిస్ట్రిబ్యూటర్లు, రియల్టర్లు, బంగారం వ్యాపారులు, చిట్‌ఫండ్‌ సంస్థల నిర్వాహకులు ఐపి పెట్టి ప్రజలకు కోట్లాది రూపాయిలు ఎగవేతకకు పాల్పడుతున్నారు.

ఐపి పెట్టిన వారు, బోర్డులు తిప్పేసిన ఆర్థిక నేరగాళ్లు జనం సొమ్ముతో జల్సాలు చేస్తున్నారు. తాజాగా రూ.180 కోట్ల వరకు నరసరావుపేట, గుంటూరులో వందలాది మందికి ఎగవేతకు పాల్పడిన పాలడుగు పుల్లారావు తన కుమార్తెకు విజయవాడలో రూ.8 కోట్లతో విల్లా కొని పెట్టారని చెబుతున్నారు. ఇటీవల అతని కుమారుడు వివాహ నిశ్చితార్థానికే రూ.2 కోట్ల వరకు ఆభరణాలు కొనుగోలు చేశారని సమాచారం. ప్రజలకు అధిక వడ్డీలు, తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం సమకూరుస్తామని నమ్మబలుకుతున్న వీరు ప్రజల నుంచి డిపాజిట్లు, చిట్స్‌ రూపంలో వసూలు చేసిన సొమ్ములో కొంత భాగం జల్సాకు, మరికొంత భాగం ఇతర రంగాలపై పెట్టుబడి పెట్టడం రివాజైంది. పైగా తమకు నష్టం వచ్చిందని సాకు చూపి ప్రజలకు మొత్తం ఎగవేతకు పాల్పడుతున్నారు. పోలీసు కేసులు నమోదు చేసినా అన్ని స్థాయిల్లో మ్యానేజ్‌ చేసి కోర్టులో ఎప్పటికో కదా తేలేది అన్న ధీమాతో ప్రజలను మోసం చేస్తున్నారు. స్థలాలు, పొలాలు అభివృద్ధి చేసి ఇస్తామని ప్లాట్స్‌ వేసి ఇస్తామని, అపార్టుమెంట్లు నిర్మించి ఇస్తామని పలువురు రియల్టర్లు మోసానికి పాల్పడుతున్న ఘటనలు కూడా వెలుగు చూస్తున్నాయి.

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - ఫిరంగిపురం



తుపాకుల లింగయ్య (ఫైల్‌)

పురుగు మందు తాగి కౌలురైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కండ్రికలో ఆదివారం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన తుపాకుల లింగయ్య (41) పదేళ్లకుపైగా కౌలు వ్యవసాయం చేస్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని వేమవరంలో కౌలుకు పొలం తీసుకుని మూడెకరాల్లో మిర్చి, నాలుగెకరాల్లో పత్తి, ఎకరంలో వరి సాగు చేపట్టాడు. బొబ్బర తెగులు సోకి మిర్చి పంట దిగుబడి పూర్తిగా పడిపోయింది. గతేడాది జులై, ఆగస్టు నెలల్లో వర్షాల కారణంగా పత్తి దెబ్బతింది. దీనికితోడు ప్రతిఏడాది ఏదోఒక కారణంతో పంటలు దెబ్బతినడంతో పెట్టుబడి కోసం చేసిన అప్పులు పేరుకుపోయాయి. రూ.15 లక్షలకుపైగా అప్పులున్నట్లు తెలిసింది. అయితే వీటిని తీర్చే మార్గమేమిటా అని కొద్దిరోజులుగా సతమవతం అవుతున్న లింగయ్య శనివారం మధ్యాహ్నం వేమవరంలోని తాను సాగుచేస్తున్న పొలం వద్దకెళ్లి పురుగుల మందు తాగి పడిపోయాడు. ఎవరో పడిపోయి ఉన్నారని గమనించిన స్థానికులు వెళ్లి చూడగా ఆయన్ను గుర్తించి గ్రామానికి సమాచారం ఇచ్చారు. దీంతో లింగయ్య కుటుంబీకులు హుటాహుటిన అక్కడికి వెళ్లి నరసరావుపేట ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఫిరంగిపురం ఎస్‌ఐ బి.రవీంద్రబాబు తెలిపారు.

అజ్ఞాతంలోకి మరో వ్యాపారి

- విజయలక్ష్మి టౌన్‌షిప్‌ అధినేత కోసం పోలీసుల గాలింపు
- సాయిసాధన చిట్‌ఫండ్‌ ఎమ్‌డి పుల్లారావు భాగస్వామిగా ఉన్న గుండా సాంబశివరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సాయిసాధన చిట్‌ఫండ్‌ అధినేత పాలడుగు పుల్లారావు ఇటీవల బోర్డు తిప్పేసిన ఘటన మరువక ముందే అతని భాగస్వామి అయిన నరసరావుపేటకు చెందిన స్థిరాస్తి వ్యాపారి గుండా సాంబశివరావు అజ్ఞాతంలోకి వెళ్లారు. ఆయన వారం రోజుల నుండి ఫోన్‌ స్విచ్ఛాఫ్‌ చేసి తన సోదరునితో సహా అదృశ్యమయ్యారు. గుంటూరుకు చెందిన దండా రాజ్యలక్ష్మి గుంటూరు పట్టాభిపురం పోలీస్‌స్టేషన్లో ఆర్థిక అంశాలకు సంబంధించి పెట్టిన కేసులో ఈయన సాంబశివరావు నిందితుడు కావడంతో పోలీసులు గాలింపు చేపట్టారు. గుంటూరు పట్టాభిపురం పోలీసులు నరసరావుపేట సమీపంలో ములకలూరు వద్దగల విజయలక్ష్మి టౌన్షిప్‌లోని సాంబశివ రావు కార్యాలయానికి శుక్రవారం రాగా ఆయన ఆచూకీ తెలియకపోవడంతో సంస్థ ఉద్యోగులైన ఇద్దర్ని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇదే కేసులో నిందితునిగా ఉన్న విజయలక్ష్మి టౌన్షిప్‌, సాయి సాధన చిట్‌ ఫండ్‌ భాగస్వామి పాలడుగు పుల్లారావు ప్రస్తుతం రిమాండ్‌ ఖైదీగా గుంటూరు జిల్లా జైల్లో ఉన్న విషయం తెలిసిందే.

నిర్లక్ష్యం ఖరీదు నిండు ప్రాణం

పే-8



అక్రమంగా మైనింగ్‌ చేస్తున్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్‌, ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు

గ్రావెల్‌ అక్రమ తవ్వకం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు పశ్చిమ మండలం చోడవరం రెవెన్యూ పరిధి సర్వే నంబర్‌ 104లో గ్రావెల్‌ అక్రమ తవ్వకాలను విజిలెన్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు ఆదివారం అడ్డుకున్నారు. పుప్పాల గోపీకృష్ణ అలియాస్‌ ఆడిటర్‌ గోపీకృష్ణ అక్రమంగా మైనింగ్‌ చేస్తున్నట్లు పొలం యజమానులు ఫిర్యాదు చేయడంతో అధికారులు తనిఖీలు చేపట్టారు. అక్రమ మైనింగ్‌ కోసం వినియోగించిన పొక్లెయినర్‌ను సీజ్‌ చేసి నల్లపాడు పోలీస్‌ స్టేషన్‌కు తరలించినట్లు జిల్లా విజిలెన్స్‌ అధికారి డి.సూర్యశ్రావణ్‌కుమార్‌ తెలిపారు.

చైతన్యంతో ఓటేద్దాం.. లక్ష్మణరావును గెలిపిద్దాం..

పట్టభద్రులకు ప్రజాసంఘాల పిలుపు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్‌ అభ్యర్థి కెఎస్‌ లక్ష్మణరావును గెలిపించాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ నెల 27న జరగనున్న పోలింగ్‌లో లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటేయాలన్నారు. లక్ష్మణరావు విజయం కోసం తాము పాటు పడతామని చెప్పారు. ఈ మేరకు నరసరావుపేటలోని యుటిఎఫ్‌ జిల్లా కార్యాలయం వద్ద ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ లక్ష్మణరావు గెలుపు ఆయన కోసం కాదని, నిరుద్యోగులు, ఉద్యోగులు, రైతులు, కార్మికులు, అన్ని రంగాల ప్రజల కోసమని చెప్పారు. అన్ని విధాలా వెనుకబడిన పల్నాడు జిల్లా సమగ్రాభివృద్ధికి అవసరమైన చర్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లగలిగే స్పష్టత లక్ష్మణరావుకు ఉందన్నారు. పట్టభద్రులు చైతన్యంగా తమ ఓటుహక్కును ఉపయోగించుకోవాలని, ప్రజా సమస్యలు పట్టని, రాజకీయ ఉపాధి కోసం పోటీ చేసేవారిని నమ్మొద్దని కోరారు. ప్రభుత్వ హామీల విస్మరణపై నిలదీయాలంటే పిడిఎఫ్‌ ఎమ్మెల్సీలు శాసన మండలిలో ఉండడం అవసరమని చెప్పారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు జి.విజయకుమార్‌, డి.శివకుమారి, సిలార్‌ మసూద్‌, పి.పెద్దిరాజు, షేక్‌ రబ్బాని, కె.రామారావు, నాగమ్మబాయి, ఇతర నాయకులు పాల్గొన్నారు.



క్రికెట్ కిట్ అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి

పల్లెటూరు చారిటబుల్ ట్రస్ట్ వితరణతో క్రీడాకారులకు ఏపీ ఎంఎస్ ఐడీసీ చైర్మన్ చల్లపల్లి శ్రీనివాసరావు ఆదివారం క్రికెట్ కిట్ అందజేశారు. తాడేపల్లి ప్రెస్ క్లబ్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడాకారులు మరింతగా ప్రతిభ కనబరిచి రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జొన్న రాజేష్, అంబటి తిరుపతిరావు, సామల నాగేశ్వరరావు, బి కోమలి, అవినాష్, పి మధు, దినేష్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు, అనంతరం చైర్మన్‌ను ఘనంగా సత్కరించారు.



బహిరంగంగా మద్యం సేవిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి- తాడేపల్లి

బహిరంగంగా మద్యపానం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తాడేపల్లి సిఐ బత్తుల కళ్యాణ రాజు హెచ్చరించారు. ఆదివారం నులకపేట, రాజు కాలనీ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. జనా వాసాల మధ్య, సమాధుల్లో మద్యం తాగుతున్న వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలకు పాల్పడిన వారిపై గట్టి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చిత్రలేఖనం పోటీలు

విజయవాడ : అమరావతి బాలోత్సవం ఆధ్వర్యంలో ఫోరం ఫర్ ఆర్టిస్ట్ సహకారంతో చిత్రలేఖనం పోటీలు సింగనగర్ వివేకానంద సెంటినరీ హైస్కూల్లో పెద్ద ఎత్తున జరిగాయి. దాదాపు 650 మంది చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్నారు. పోటీల అనంతరం జరిగిన సభకు అమరావతి బాలోత్సవం సింగ్ నగర్ బాధ్యులు సిహెచ్.పద్మ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా అమరావతి బాలోత్సవం అధ్యక్షులు ఎస్‌పి రామరాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ పిల్లలంతా ఎంతో ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలో పాల్గొనడం చాలా ఆనందం కలిగించిందన్నారు. పిల్లల చదువుల వెంటే పడకుండా ఇలాంటి ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా తమ ప్రతిభను వెలికి తీయాలని అన్నారు. మరో ముఖ్య అతిథిగా విచ్చేసిన అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం అధ్యక్షులు వెంకటరామరాజు మాట్లాడుతూ ఎంతమంది పిల్లలు చిత్రలేఖనం పోటీల్లో పాల్గొనడం చాలా గొప్ప విషయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం బాధ్యులు ఈ క్రాంతి ఫోరం ఫర్ ఆర్టిస్ట్ బాధ్యులు ప్రముఖ చిత్రకారులు చిత్రం సుధీర్ సంధ్యారాణి గిరిధర్ తదితరులు న్యాయ నిర్ణేతలుగా పాల్గొన్నారు. అనంతరం బహుమతి ప్రదానోత్సవం జరిగింది.

చిత్త రంజన్ గ్రేడ్-2 శాఖ గ్రంథాలయం సత్యనారాయణపురంలో ఆదివారం చదవటం మాకు ఇష్టం కార్యక్రమంలో భాగంగా నీకు నచ్చిన చిత్రం అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం గ్రంథాలయ అధికారి పి.సంపత్ కుమార్ విద్యార్థులను గ్రంథాలయ పాఠకులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆలోచనలకు అద్భుత రూపం చిత్ర లేఖనం అన్నారు. ఈ కళకు పరిమితులు లేవని అన్నారు. చిత్ర లేఖనానికి వివిధ రూపాలున్నాయని, సహజత్వాన్ని ప్రతిబింబించే చిత్ర లేఖనం ఒకవైపు అయితే కల్పిత లోకాల్లో మరొకవైపు అన్నారు. భావవ్యక్తీకరణ, మానవ చరిత్ర, సాంప్రదాయాలు, జీవనశైలి వ్యవస్థ ఇలా దేనినైనా ఆవిష్కరించగలిగేది చిత్ర లేఖనం అన్నారు. విద్యార్థుల అభివృద్ధిలో కీలకమైన కళ చిత్ర లేఖనం అన్నారు. భారత జాతి వీరయోధుడు ఛత్రపతి శివాజీ చిత్రపటాన్ని అద్భుతంగా గీసి ప్రథమ ద్వితీయ బహుమతులను ఎ.సుగుణ సుందరి, బి.తులసి గెలుచుకున్నారు.

డంపింగ్ యార్డ్ కంపు నుంచి ప్రజలకు మోక్షం?

-గతంలో ఇచ్చిన టెండర్లు రద్దు
-కొత్త ప్రభుత్వంలో పనులు ప్రారంభం
-టన్నులకొద్ది మేట వేసిన వేస్ట్ వేరు చేసేందుకు కొత్త టెక్నాలజీ

ప్రజాశక్తి తెనాలి

డంపింగ్ యార్డ్ కంపుతో ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులకు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు డంపింగ్ యార్డును తరలించాలని పలుమార్లు వినతులు సమర్పించినా వారి ప్రయత్నాలు ఫలించలేదు. దాదాపు ఏడెనిమిది సంవత్సరాల క్రితం సష్టి అనే ఆర్గనైజేషన్ చెత్త తరలింపుకు టెండర్ దక్కించుకున్నా పనులు మాత్రం ముందుకు సాగలేదు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత దీనికి మోక్షం లభించింది. మున్సిపల్ కమిషనర్ బి శేషన్న వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.

స్థానిక బుర్రిపాలెం రోడ్డులో డంపింగ్ యార్డ్ కొన్నేళ్లగా ఉంది. పట్టణంలో గృహాలు, వ్యాపార కూడళ్ళ నుంచి తరలించిన చెత్తా చెదారాన్ని మున్సిపల్ ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్ కు తరలించేవారు. డంపింగ్ యార్డ్ కోసం కేటాయించిన ప్రాంతంలో చుట్టు ప్రహరీ నిర్మించి చెత్తను మేట వేస్తూ వచ్చారు. అయితే వేల టన్నులు చెత్త పేరుకుపోవడంతో విపరీతమైన దుర్గంధం వెలువడి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. ప్రహరీ దాటి పొలాలలో కూడా వ్యర్థాలు పడుతుండటంతో కొంత చెత్తను మునిసిపల్ సిబ్బంది తగులపెట్టేవారు. ఈ నేపథ్యంలో వెలువడే దుర్గంధం, పొగ ఆ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగించింది. అంతేకాకుండా బుర్రిపాలెం రోడ్డులో వివేకానంద సెంట్రల్ స్కూల్, గుప్త కళాశాల, వెస్ట్ వుడ్ పబ్లిక్ స్కూల్, ఏ ఎస్ ఎన్ ఫార్మసీ కళాశాల, ఏ ఎస్ ఎన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల వంటి విద్యాసంస్థలు ఉన్నాయి. దీంతో విద్యార్థులు కూడా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అయితే తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో డంపింగ్ యార్డ్ వ్యర్థాలను తరలించేందుకు మోక్షం లభించింది. గతంలో ఏడెనిమిది సంవత్సరాల క్రితం సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కింద ఓ పథకం మంజూరు అయింది. ఆ పథకములో వేస్ట్ తరలింపుకు టెండర్ దక్కించుకొన్న సృష్టి సంస్థ పనులు చేపట్టలేదు. దీంతో ఆ సంస్థకు ఇచ్చిన టెండర్‌ను మున్సిపల్ అధికారులు రద్దు చేశారు. టెండర్ దక్కించుకున్న సంస్థతో ఉపసంహరణ చేయించారు. గతేడాది నవంబర్లో మరో సంస్థతో ఒప్పందం కుదుర్చుకొని, కొత్తగా యంత్రాల సాయంతో పనులు ప్రారంభించారు. ఆధునిక టెక్నాలజీతో చేపట్టిన పనులలో ముందుగా వ్యర్థాలను విడగొడుతున్నారు. మట్టి, ప్లాస్టిక్, గాజు, ఇతర వ్యర్థాలను యంత్రాల ద్వారా వేరు చేయిస్తున్నారు. ఇలా వేరు చేసిన వ్యర్థాలలో మట్టిని లో లెవెల్ ప్రాంతాలలో ఉపయోగించి, మిగిలిన వ్యర్థాలు ఎక్కడెక్కడ ఉపయోగపడితే అక్కడకు తరలించి, రెండు మూడు నెలల్లో డంపింగ్ యార్డ్ మొత్తం ఖాళీ చేయనున్నారు. దీంతో ప్రజలు సుదీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న డంపింగ్ యార్డ్ కంపు నుంచి మోక్షం లభించనుంది.



బుర్రిపాలెం రోడ్ లో డంపింగ్ యార్డ్



చెత్తను వేరు చేస్తున్న యంత్రం

డంపింగ్ యార్డ్ నుంచి వ్యర్థాల తరలింపు

బి శేషన్న, మున్సిపల్ కమిషనర్ తెనాలి

డంపింగ్ యార్డ్ లో పేరుకుపోయిన వ్యర్థాలతో సంవత్సరాల తరబడి ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్న మాట వాస్తవమే. ఈ నేపథ్యంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ చొరవతో ప్రజలకు మోక్షం లభించనుంది. గతంలో టెండర్లు దక్కించుకుని పనులు చేపట్టని సష్టి సంస్థ వైదొలిగింది. గతేడాది నవంబర్లో మరో సంస్థతో ఒప్పందం కుదుర్చుకొని పనులు చేపట్టాం. ముందుగా వ్యర్థాలను విడగొట్టే ప్రక్రియ యంత్రాల సాయంతో ప్రారంభమైంది. రెండు మూడు నెలలలో పూర్తిగా వ్యర్థాలను విభజించి తరలించడం జరుగుతుంది. మొత్తంగా దుర్గంధం నుంచి ప్రజలకు మోక్షం లభించినట్లే.



కమిషనర్ బి శేషన్న

బర్డ్‌ఫ్లూతో మటన్ ధరకు రెక్కలు

ప్రజాశక్తి - గంపలగూడెం : ఇటీవల ఏపీ తెలంగాణలో బర్డ్ ఫ్లూ వ్యాపించిందన్న ప్రచారంతో అధికారులు చికెన్ దుకాణాలు మూసి వేయించిన విషయం తెలిసిందే. ఇక సగటు మానవుడు వారానికి రెండు లేదా మూడుసార్లు మాంసాహారం లేనిదే ముద్ద దిగని పరిస్థితులు నెలకొన్నాయి. ఇక ఆదివారం ఈ కొనుగోళ్లపై చర్చించాల్సిన అవసరమే లేదు. చికెన్ దుకాణాల మూసివేతతో మటన్, ఫిష్ దుకాణదారులు అడ్డగోలుగా ధరలు పెంచేశారు. గతవారం మటన్ ధర పరిశీలిస్తే రూ.600 లు ఉండగా, అది ఆదివారం రూ.వెయ్యికి పెంచి, ఫిష్ 170 నుండి 180 రూపాయలు ఉండగా అది నేడు 200 నుండి 230 వరకు అమ్మకాలు చేసినట్లు తెలిసింది. దుకాణదారులు, చేపలు కాటా వేసి ఇచ్చే సమయం కూడా లేకుండా వినియోగదారులు వస్తుండటంతో ఇదే అవకాశంగా మలుచుకున్న దుకాణదారులు సుమారు చూసి విక్రయిస్తుండటం కనిపించింది. ప్రతివారం క్వింటాళ్ల స్థాయిలో చికెన్ విక్రయాలు జరుగుతుండగా, ఆ ఎఫెక్ట్ మటన్, ఫిష్‌పై పడిందని, వినియోగదారులు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితులు గంపలగూడెం-తోట మూలలో ఉన్న దుకాణాల్లో దర్శనమిచ్చాయి. ఇటువంటి పరిస్థితుల్లో అధికారులు కలగజేసుకొని నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.



రద్దీగా ఉన్న మటన్ దుకాణం

పేదలకు పెన్షన్లు, నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అరండల్‌పేటలోని అవోపా కార్యాలయంలో ఆదివారం అవోపా అధ్యక్షులు కె.వి.బ్రహ్మం అధ్యక్షతన 108 మంది పేదలకు పెన్షన్లు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చార్టెడ్ అకౌంటెంట్ జి.ఎస్.వి.శశిభూషణ్, అవోపా మహిళా విభాగం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చైర్‌పర్సన్ ఆరవేటి నిర్మల పాల్గొన్నారు. శశిభూషణ్ మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో ప్రతి నెలా 108 మంది పేదలకు ఒక్కొక్కరికి రూ.500లు చొప్పున పెన్షన్ ఇవ్వటం, వెయ్యి రూపాయలు విలువ చేసే నిత్యావసర వస్తువులు, విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వడం అభినందనీయమని తెలిపారు. ఈ సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా రూ.25వేలు విరాళంగా అందించారు. ఆరవేటి నిర్మల మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు ఉచితంగా మందులు అందించడం, ప్రతివారం గోసేవ నిర్వహించటం అభినందనీయమని తెలిపారు. ఆలిండియా స్థాయిలో సి.ఎ.ఫైనల్ పరీక్షలో 40వ ర్యాంకు సాధించిన కాకుమాను కృష్ణచైతన్యను సత్కరించారు. టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా నియమితులైన కొలిశెట్టి రామ్మోహనరావుకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో అవోపా రాష్ట్ర కార్యదర్శి రాచపూడి సుబ్బారావు, యేలూరి నరసింహారావు, రాధాకృష్ణయ్య, మహంకాళి శ్రీనివాసరావు, మద్ది సాయిరమేష్ తదితరులు పాల్గొన్నారు.



పెన్షన్లు పంపిణీ చేస్తున్న శశిభూషణ్, కె.వి.బ్రహ్మం తదితరులు

ప్రజాశక్తి 3
గుంటూరు జిల్లా
సోమవారం 17 ఫిబ్రవరి 2025

బ్యాంకుకు విశ్రాంత ఉద్యోగులే పునాది రాళ్లు

యుపిఐ జోనల్ హెడ్ సయ్యద్ జవహర్

ప్రజాశక్తి-గుంటూరు

బ్యాంకుకు విశ్రాంత ఉద్యోగులే పునాదిరాళ్లని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండి యా జోనల్ హెడ్ ఎస్.జవహర్ అన్నారు. ఆదివారం ఆలిండియా యూనియన్ బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్‌లో భాగమైన 'యూనియన్ బ్యాంక్ రిటైరీస్ అసోసియేషన్ (ఏపీ తెలంగాణ)' 8వ ట్రీ యాన్యువల్ కాన్ఫరెన్స్ స్థానిక బ్రాడీపేట పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్ మాట్లాడుతూ సాధారణ ఖాతాదారులు, వాణిజ్య పారిశ్రామిక వేత్తల సహకారంతో వ్యాపారపరంగా అత్యు న్నత శిఖరాలు చేరుకున్న బ్యాంకుల పురోభివృద్ధిలో విశ్రాంత ఉద్యోగులు, అధికారులు పునాదిరాళ్లని పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన అసోసియేషన్ అధ్యక్షులు ఆవుల వెంకయ్య మాట్లాడుతూ రూ.ఐదు లక్షల కోట్లకుపైగా టర్నవర్ ఉన్న యూనియన్ బ్యాంక్ అభివృద్ధిలో లక్షలాదిమంది ఉద్యోగులు. అధికారుల శ్రమ దాగి ఉందని చెప్పారు. విశ్రాంత ఉద్యోగుల ప్రధాన సమస్యలైన 1995 నుండి పెన్షన్ అప్‌డేషన్



సమావేశంలో మాట్లాడుతున్న సయ్యద్ జవహర్

చేయాలని, మెడికల్ అల వెన్సులపై జిఎస్టి 18 నుండి ఐదు శాతం తగ్గించాలని, అన్ని ప్రధాన సమస్యలపై ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్ మేనేజ్‌మెంట్ నేరుగా విశ్రాంత ఉద్యోగులతోనే చర్చించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జోనల్ హెడ్ జవహర్ ఫర్జాన్ దంపతులను, రెండు రాష్ట్రాల నాయకులను అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో యుబిఐ విశ్రాంత జోనల్ అధికారులు టిఎల్‌వి రావు, డాక్టర్ కొసరాజు రవీంద్రనాథ్, ఇ.పుల్లారావు, ఏపీ బ్యాంక్ రిటైరిస్ ఫెడరేషన్ అధ్యక్షులు బివివి కొండలరావు, ప్రధాన కార్యదర్శి ఏ యల్లారావ్, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ వి రమణ, జిల్లా బ్యాంక్ రిటైరిస్ కోఆర్డినేషన్ కమిటీ అధ్యక్షులు హరిబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అసోసియేషన్ 2025-28 సంవత్సరాలకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

పెండింగ్ డైట్, కాస్మోటిక్ ఛార్జీల చెల్లింపునకు హర్షం : కేసన

ప్రజాశక్తి - మంగళగిరి

బిసి సంక్షేమ శాఖ ఈనెల 14న నిర్వహించిన సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయు డు, వసతి గృహ విద్యార్థులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.50.27 కోట్ల డైట్, రూ 31.20 కోట్ల కాస్మోటిక్ బిల్లులు వెంటనే చెల్లించాల్సించాలని ఆర్థిక శాఖ అధికారులను ఆజ్ఞా పించడం పట్ల ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం తరపున రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రూ. 3.35 కోట్ల ట్యూటర్ల పెండింగ్ గౌరవ వేతనాలు, ఫ్రీ పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్పులు కలిపి రూ.254.48 కోట్లు, ఎన్టీఆర్ విదేశీ విద్యాధారణ పథకపు పెండింగ్ బిల్లులు రూ49.55 కోట్లు వెంటనే చెల్లించా ల్సిందిగా అధికారులను కోరడం ఆనందదాయకమని పేర్కొ న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 660 బీసీ సంక్షేమ హాస్టళ్ల మర మ్మతుల కోసం రూ.110.52 కోట్లు, మరో నాలుగు గురుకుల పాఠశాలల నిర్మాణానికి రూ. 119.79 కోట్లు కేటాయించడం సంతోషంగా ఉందని తెలిపారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన బీసీ విద్యార్థుల సంక్షేమానికి కృషి చేస్తున్నందుకు సీఎంకు కేసన కృతజ్ఞతలు తెలిపారు. ఏలూరు, నెల్లూరు, కర్నూలులో మహా త్మా జ్యోతిబా పూలే బీసీ భవనాలను పూర్తి చేయాలని, అనంత పూర్, తిరుపతి, విశాఖపట్నంలో నిరుద్యోగ బిసి యువతకు శిక్షణ ఇచ్చేలా, బీసీ స్టడీ సర్కిళ్ల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడాన్ని, బీసీ సమాజం హర్షిసోందని పేర్కొన్నారు. కుప్పం నియోజకవర్గంలో ఒక గురుకుల పాఠశాల ఏర్పాటుకు, నసన కోట, ఆత్మకూరులలో గురుకుల పాఠశాలల్ని, జూనియర్ కళా శాలలుగా అప్‌గ్రేడ్ చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. తామడిగినట్లు బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు, 56 బీసీ కులాల కార్పొరేషన్లకు వారి వారి జనాభా-పేదరికాల అంచనా మేరకు రానున్న బడ్జెట్లో కేటాయింపులు చేస్తానన్న సీఎంకు శంకరరావు ధన్యవాదాలు తెలిపారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న చిల్లపల్లి

కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

యర్రబాలెంలో రోజువారీ కూలి చేసుకొని జీవనం సాగించే కార్మికుడు కోడి ఏడు కొండలు మృతి చెందాడు. రోజులాగే శనివారం సరు కు లోడు ఎత్తే పనికి వెళ్లాడు. ప్రమాద వశాత్తు కింద పడటంతో తీవ్రంగా గాయ పడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ ఆది వారం మృతి చెందాడు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు సూచనల మేరకు పల్లె టూరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జొన్న. రాజేష్ ఏడుకొండల కుటుంబ సభ్యులు వారి నివాసానికి వెళ్లి రూ.10 వేలు ఆర్థిక సాయం అంద జేశారు. ప్రమాదబీమా పరిహార నగదు మంజూరయ్యేలా చూస్తామని గ్రామానికి చెందిన లేళ్ల. సాయి నందన్ తెలిపారు. కార్యక్రమంలో బత్తినేని. అంజయ్య, అజయ్ బాబు, పావని, చైతన్య కూటమి నాయకులు పాల్గొన్నారు.

చెరువులో యువతి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - వెల్దుర్తి

పరిధిలోని మిట్టమీదపల్లి గ్రామం సమీపంలోని కుంటలో గుర్తు తెలియని యువతి మృత దేహాన్ని పోలీసులు కను గొన్నారు. యువతి మృత దేహం మూడు రోజు లుగా కుంటలో ఉన్నట్లు తెలుస్తోంది. ఎస్ఐ సమందర్‌వలి మృతదేహాన్ని చెరువు నుండి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎవరికైనా ఈ యువతి ఆచూకీ తెలిస్తే వివరాలు తెలియ వలసిందిగా ఎస్ఐ కోరారు.

తెనాలిలో పండ్ల వ్యాపారి హత్య

ప్రజాశక్తి - తెనాలి


ఆసుపత్రిలో రబ్బానీ మృతదేహం

పట్టణంలో పండ్ల వ్యాపారి హత్య కలకలం రేపింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం చెంచుపేట భాను టీ స్టాల్ వద్ద పండ్ల వ్యాపారం చేసే షేక్ రబ్బానీ(45)పై అతని బంధువు కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. స్థానికులు స్పందించి హుటాహుటిన తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా రబ్బాని చికిత్స పొందుతూ మతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న త్రీటౌన్ సీఐ రమేష్ బాబు, బృందం మృతుడి బంధువుల నుంచి వివరాలు సేకరి స్తున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో పాండురంగపేటకు చెందిన గౌస్ బాషా హత్యకు పాల్పడ్డాడని ప్రాథ మికంగా నిర్ధారణకు వచ్చినట్లు, నిందితుడు పరారీలో ఉన్నట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి - తెనాలి : : రైలు ఢీకొని ఓ మహిళ మృతి చెం దింది. సేకరించిన వివరాల ప్రకారం గుడివాడ గ్రామా నికి చెందిన బొద్దులూరి పద్మావతి (55) కొలక లూరు రైల్వే స్టేషన్లో విజయవాడ నుంచి ఒంగోలు వెళ్ళే పాసింజర్ ఎక్కే క్రమంలో పట్టాలు దాటు తుం డగా, విజయవాడ వైపు వెళుతున్న సూపర్ ఫాస్ట్ ఎక్స్ప్రెస్ ఢీకొనటంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఉదయం పూట మంచు కార ణంగా ట్రైన్ కనపడక ఘటన చోటు చేసుకుందని స్థానికులు చెబుతున్నారు.

ట్యాంకర్ ఢీకొని వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్థానిక పట్టాభిపురంలో ఆదివారం ఉదయం సెప్టిక్ ట్యాంకు క్లీన్ చేసే ట్యాంకర్ ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన పట్టాభిపురం పెట్రోలు బంకు వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు సాయి సునంద అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్న డి.కమల(82) ఇంటి నుంచి రోడ్డుపైకి వస్తుండగా పెట్రోలు బంకు నుంచి బయటకు వస్తున్న ట్యాంకర్ ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృత దేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రిమాండ్‌కు గంజాయి నేరస్తులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

యువతకు గంజాయి సరఫరా చేస్తున్నా ముగ్గురిని దుగ్గిరాల పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దుగ్గిరాల మండ లంలోని పెదపాలెం గ్రామానికి చెందిన పల్లెకోన గోపి, జముడు గాని కోటేశ్వరరావు మంగళగిరి రూరల్ మండలంలోని నూతక్కి గ్రామానికి చెందిన లంకి రెడ్డి సాంబిరెడ్డి ల వద్ద సుమారు కేజీ గంజాయిని శనివారం పెదపాలెం గ్రామంలో పట్టుకున్నారు. ఆదివారం నిందితులు ముగ్గురిని తెనాలి జడ్జీ సమక్షంలో హాజ రు పరచగా రిమాండుకు ఆదేశించారని ఎస్ఐ ఎస్.వెంకట రవి తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని విద్యార్థి మృతి

ప్రజాశక్తి - నకరికల్లు

ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వారిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో విద్యార్థి మృతి చెందిన సంఘ టన ఆదివారం తెల్లవారుజామున దేచవరం మిద్దె వద్ద చోటు చేసుకుంది. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం దుర్గి మండలం అడిగోప్పల గ్రామానికి చెందిన ఏల్చూరి నాగేశ్వరావు, కసుకుర్తి సుమంత్ (16) ద్విచక్రవాహనంలో నరసరావుపేట వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. సుమంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. నాగేశ్వరావుకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుని తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. మృతుడు నరసరావుపేటలోని వాగ్దేవి కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతినిధులు, హాజరైన బాధితులు



రాజీ మార్గంలో కలుద్దాం

సాయి సాధన చిట్‌ఫండ్ బాధితుల సమావేశంలో నిర్ణయం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా


సాయి సాధన చిట్ ఫండ్ బాధితుల సమావేశం నరసరావుపేట పట్టణం పల్నాడు రోడ్డులోని కమ్మ హాస్టల్లో ఆదివారం జరిగింది. రాజీ మార్గంలో ఒక కమిటీగా ఏర్పడి సాయి సాధన చిట్ ఫండ్ అధినేత పుల్లారావును ప్రతినిధులు కలవాలని బాధితులు సమావేశంలో నిర్ణయించుకున్నట్లు తెలిసింది. 503 మంది బాధితులకు రూ.108 కోట్లు అప్పులున్నట్లు తేల్చారు. పుల్లారావు ఆస్తులు రూ.90 కోట్ల వరకు ఉన్నట్లు గుర్తించారు. బాధితుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు ప్రముఖ న్యాయవాది చేకూరి ప్రతాప్ అన్నారు. బాధితుల వివరాలు తీసుకోవాలని కమిటీ సమావేశం నిర్ణయం తీసుకుంది.



ఘనంగా కిడ్స్ పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల పట్టణంలోని కిడ్స్ పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీనివాస్ కళ్యాణ్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రశాంత్, ఎంఇఒ అల్లి సురేష్, కెసిపి జనరల్ మేనేజర్ వి.వెంకట రమణ, పి.రాంప్రసాద్ హాజరయ్యారు. అతిథులు మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని చదువులో రాణించాలన్నారు. ఉన్నత స్థానాలకు ఎదిగి గురువులు, తల్లిదండ్రులకు పాఠశాలకు మంచిపేరు తేవాలన్నారు. కెసిపి సిమెంట్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో కిడ్స్ పాఠశాలను ఏర్పాటు చేసి, విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నారని ప్రశంసించారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా ముక్త్యాల కెసిపి సిమెంట్ ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వి.మధుసూదన్ రావణబ్రహ్మగా అలరించారు. వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్ఎం.జి.రామకృష్ణశాస్త్రి, కెసిపి హెచ్ఆర్ అండ్ ఎస్‌జి.శ్రీనివాస్‌రావు, హెచ్ఒడిలు సండ్ర ప్రసాద్, బి.శ్రీనివాసరావు, కె.రామకోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, కెసిపి ఉద్యోగులు పాల్గొన్నారు.



రావణబ్రహ్మ వేషధారి అయిన ముక్త్యాల కెసిపి సిమెంట్ వైస్ ప్రెసిడెంట్ మధుసూదన్‌రావుతో ఉద్యోగులు

సజావుగానా..? వాయిదానా..?

- నేడు పిడుగురాళ్ల మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక - ఇప్పటికే రెండుసార్లు వాయిదా
- వైసిపి కౌన్సిలర్ల హాజరు, అభ్యర్థికి మద్దతుపై ఉత్కంఠ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల




ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడిన మున్సిపల్ వైస్ ఛైర్మన్-2 ఎన్నిక ఈసారైనా సాఫీగా సాగుతుందా? అనేది పట్టణంలో చర్చాంశనీయాంగా మారింది. సోమవారం నిర్వహించనున్న ఎన్నికలో కౌన్సిలర్లు ఎవర్ని ఎన్నుకుంటారో అనే ఉత్కంఠా నెలకొంది. పూర్తి మెజారిటీ వైసిపికి ఉండగా వైసిపి కౌన్సిలర్లను టిడిపిలోకి చేర్చుకొని వైస్ ఛైర్మన్ పదవిని కైవసం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే కొందరు వైసిపి కౌన్సిలర్లతో టిడిపి నాయకులు మంతనాలు జరిపారని, మరి కొందరని రెండు మూడ్రోజుల కిందటే వేరే ప్రాంతాలకు తరలించారని వార్తలొస్తున్నాయి. వైసిపి కౌన్సిలర్లను పోలీసులు తీసుకెళ్లారంటూ వారి బంధువులు సోషల్ మీడియాల్లో చెబుతుండడంతో అసలేం జరుగుతుంతో సామాన్యులకు అంతుబట్టడం లేదు. వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉండగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో తమను నామినేషన్ అయినా వేయనీయకుండా 33 వార్డులనూ వైసిపి ఏకగ్రీవం చేసుకుందని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తాము పదవులను వారికెందుకు పోనిస్తామని టిడిపి నాయకులు అంటున్నారు.

వైస్‌చైర్మన్-2గా ఉన్న కొమ్ము ముక్కంటి గతేడాది మేలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆ ఖాళీని భర్తీ చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నెల 3వ తేదిన ఎన్నిక నిర్వహించగా సరైన సమయానికి కౌన్సిలర్లు బీ ఫారం ఇవ్వకపోవడంతో మరుసటి రోజుకు ఎన్నిక వాయిదా పడింది. ఆ తర్వాతి రోజుకూడా కౌన్సిలర్లు ఐదుగురే హాజరవడంతో కోరం లేని కారణంగా ఎన్నికను మళ్లీ వాయిదా వేశారు. సోమవారం జరగనున్న ఎన్నికలో వైస్ ఛైర్మన్ పదవికి ఉన్నం భారతి, రేపాల రమాదేవి పోటీ పడుతున్నారు. గతంలో నిర్వహించిన సాధారణ ఎన్నికల్లో వైసిపి 33 వార్డులకు 33 వార్డులను ఏకగ్రీవం కాగా గత సంవత్సరం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల ముందు వైసిపి కౌన్సిలర్ ఉన్నం భారతి టిడిపిలో చేరారు. మిగిలిన 32 మంది కౌన్సిలర్లలో వైస్ ఛైర్మన్ ముక్కంటి చనిపోగా మిగిలిన 31 మంది కౌన్సిలర్లు వైసిపి పార్టీలో కొనసాగుతున్నారు. 17 మంది కౌన్సిలర్ల మద్దతున్నవారు వైస్‌చైర్మన్‌గా ఎన్నికవుతారు. మంతనాలు, వ్యూహాలు, ప్రతివ్యూహాల నేపథ్యంలో ఎన్నిక ఉత్కంఠగా మారింది.

మాచర్లలో ప్రచారం



వినుకొండ మండలంలో ప్రచారం



అందరి సమస్యలపైనా మండలిలో పిడిఎఫ్ గళం

కెఎస్ లక్ష్మణరావును గెలిపించాలని ప్రజా సంఘాల ప్రచారం - కరపత్రాలిచ్చి ఓట్ల అభ్యర్థన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

శాసన మండలి ఏర్పడిన నాటి నుండి ఎమ్మెల్సీలుగా ఎన్నికై ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కార్మికులు, రైతులు, నిరుద్యోగులు, విద్యారంగంలోని సమస్యలపై ప్రభుత్వాలను పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ప్రశ్నిస్తున్నారని కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ అన్నారు. మండలిలో ప్రజాగొంతుకగా ఉంటున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కెఎస్.లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ మేరకు పట్టణంలోని శ్రీచైతన్య, మోడరన్, విఐటి స్కూల్స్‌లోని ఉపాధ్యాయులను ఆదివారం కలిసి ఓట్లు అభ్యర్థించారు. కౌలు రైతుల పంట రుణాల కోసం బ్యాంకర్స్ కమిటీలో, ప్రభుత్వ వేదికలపై కెఎస్ లక్ష్మణరావు పోరాడారని చెప్పారు. పల్నాడు ప్రాంతంలో వెనుకబడిన మండలాలకు తాగు, సాగునీటి కోసం వరికపూడిసెల ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రభుత్వాలకు పలుమార్లు విన్నవించడంతోపాటు ప్రణాళికాబద్ధంగానూ కృషి చేశారన్నారు.

ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయడం లేదని, కనీస వేతనాలను అమలు చేయడం లేదదని, స్కీమ్ వర్కర్ల వేతనాల పెంపు విషయాన్నే మరిచారని పాలకులను విమర్శించారు. నిరుద్యోగులకు భృతి వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ప్రజలపై వేసిన విద్యుత్ భారాలను ఈ ప్రభుత్వమూ కొనసాగిస్తోందన్నారు. వీటన్నింటిపై చట్టసభల్లో ప్రభుత్వాలను ప్రజల తరుపున ప్రశ్నించచడానికి పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావుకు ఓటేయాలని కోరారు. ప్రచారంలో వివిధ సంఘాల నాయకులు పి.వెంకటేశ్వర్లు, వి.రాజశేఖర్, టి.ప్రతాపరెడ్డి, పి.గణేష్ పాల్గొన్నారు.

ముప్పాళ్ల మండలం మాదలలో ప్రచారం



ప్రజాశక్తి-ముప్పాళ్ల

కెఎస్ లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ మండలంలోని మాదలలో ప్రచారం చేశారు. పట్టభద్రులను కలిపి ఓట్లు అభ్యర్థించారు. ప్రజా సంఘాల నాయకులు ఎం.వెంకటరెడ్డి, సిహెచ్.నాగమల్లేశ్వరరావు, జి.జాలయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కె.ఎస్. లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ సిఐటియు నాయకులు పట్టభద్రులను కలుస్తూ కరపత్రాలను పంచుతూ ప్రచారం చేశారు. పట్టణంలోని ఎస్‌కెబిఆర్ క్రీడా మైదానంలో ఉదయాన్నే వాకింగ్‌కు వచ్చిన పట్టభద్రులు, ఉద్యోగులు, మేధావులను కలిసి లక్ష్మణరావు గెలుపు ఆవశ్యకతను వివరించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్, నాయకులు బి.మహేష్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విద్యార్థి, యువజన సంఘాలు, నిరుద్యోగుల సమస్యలను మండలి వేదికగా పోరాడుతున్నది పిడిఎఫ్ ఎంఎల్‌సిలు మాత్రమేనని అన్నారు. సమస్యలపై శాసన మండలిలో గళమెత్తే వారిని, మేధావులను పట్టభద్రులందరు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఉద్యోగులకు పిఆర్‌సి, ఐఆర్ కోసం, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్లకు కనీస వేతనాల కోసం, మోగా డిఎస్‌సి ప్రకటించాలని, పంటలకు మద్దతు ధర కోసం నిర్వహించిన పోరాటాలకు పిడిఎఫ్ ఎంఎల్‌సిలు మద్దతుగా నిలిచారన్నారు. ప్రజల సమస్యపై పోరాడే పిడిఎఫ్ తరుపున పోటీచేస్తున్న లక్ష్మణరావును అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత అందరిపైనా ఉందన్నారు. ప్రచారంలో నాయకులు శోభన్‌కుమార్, సురేష్, వెంకట్రావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

ఈనెల 27న జరిగే శాసనమండలి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావుకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మండలంలోని వేల్పూరు, గంటవారిపాలెం గ్రామాల్లో ప్రజా సంఘాలు ప్రచారం చేశాయి. గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి కరపత్రాలు ఇచ్చారు. రైతుసంఘం నాయకులు బి.వెంకటరాయుడు మాట్లాడుతూ వేల్పూరు జెడ్‌పి పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం సైకిల్ స్టాండ్ నిర్మాణం కోసం తన ఎమ్మెల్సీ నిధులిచ్చారని తెలిపారు. ప్రజా సమస్యలపై శాసన మండలిలో మాట్లాడుతున్నారని చెప్పారు. ప్రచారంలో ఎస్.గోవిందరాజులు బి.అప్పారావు పాల్గొన్నారు.

లక్ష్మణరావు గెలుపు చారిత్రక అవసరం



ప్రచారంలో పాల్గొన్న పాశం రామారావు

- పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ గెలుపునకు విస్తృత ప్రచారం
- మొదటి ప్రాధాన్య ఓటు వేయాలని విజ్ఞప్తి
- పట్టభద్రుల నుంచి విశేష స్పందన
- మరలా ఆయననే గెలిపించుకుంటామని స్పష్టం చేసిన విద్యావంతులు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

కృష్ణా-గుంటూరు-ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ, ఆదివారం ఉదయం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం గ్రామంలో ప్రజా సంఘాల నాయకులు కరపత్రాల పంపిణీ చేస్తూ, విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు మాట్లాడుతూ.. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, అవుట్ సోర్సింగ్ కార్మికులు తదితర అన్ని వర్గాల ప్రజల సమస్యలు పరిష్కారం కోసం పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. శాసనమండలిలో ప్రజల గొంతుకగా నిలిచి, సమస్యల పరిష్కారం చేసేందుకు, పాలక పక్షాలపై ఒత్తిడి తీసుకువచ్చి, ఎన్నోపోరాటాలు చేశారని అన్నారు. ఈ ప్రచారంలో పలువురు పట్టభద్రులు నుంచి విశేష స్పందన లభించింది. తమ ఓట్లు లక్ష్మణరావుకే గతంలోనే వేశామని, మరల ఆయనకే తమ మద్దతని స్పష్టం చేశారు. విద్యావంతులు, ప్రైవేట్ ఉద్యోగులు, పట్టభద్రుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ ప్రచార కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, రైతు నాయకులు గుంపెన వెంకటేశ్వరరావు, సిఐటియు నాయకులు ఎస్.కె,గన్, డివైఎఫ్ఐ నాయకులు పల్లె భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాబుప్రసాద్

తెనాలిరూరల్ : కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పీపుల్స్ డెమోక్రాటిక్ ఫ్రంట్(పిడిఎఫ్) అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు గెలుపు నల్లేరు మీద నడకే అని ప్రజాసంఘాల నాయకులు కొల్లిపర బాబుప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజాసంఘాల నాయకులతో కలసి ఆదివారం ప్రచార కరపత్రాలు పంపిణీ చేస్తూ ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. ఉద్యోగుల గొంతుకలను శాసనమండలిలో వినిపించాలంటే మళ్లీ కెఎస్ లక్ష్మణరావును ఎమ్మెల్సీగా గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రచారంలో భాగంగా సిపిఐ, జనసేన, వైఎస్ఆర్సిపి కార్యాలయాలతో పాటు పాఠశాలలు, కాన్వెంట్లు కళాశాలలు, కోచింగ్ సెంటర్లు, హాస్టళ్ళ, సచివాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు, ఇన్సూరెన్స్ కార్యాలయాలు, తపాలా శాఖ, విద్యుత్ శాఖ, రైల్వే స్టేషన్, బస్టాండ్, అంగన్వాడి సెంటర్లు, కోర్టులు, లాయర్ల అసోసియేషన్లు, ఫైనాన్స్ కార్యాలయాలు, క్రెడిట్ సొసైటీలు ఎన్జీవో పెన్షనర్ అసోసియేషన్లు, డాల్ మిల్, వర్కర్స్ యూనియన్ లీడర్స్, బేవరేజెస్, ముఠా వర్కర్స్, మార్కెట్ ముఠా వర్కర్స్, తాపీ వర్కర్ల యూనియన్, రాడ్ బెండింగ్ యూనియన్, సెంట్రింగ్ వర్కర్ల యూనియన్, మున్సిపల్ వర్కర్ల యూనియన్, రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్, ప్రజాస్వామ్య పరిరక్షణ కార్యాలయాలు, ఐక్యవేదిక సంఘాల నాయకులు, ప్రజా చైతన్య వేదిక నాయకులు, డాక్టర్ బి.ఆర్ అసోసియేషన్లు, జూనియర్ కాలేజీల పెన్షనర్లును కలసి లక్ష్మణరావు గెలుపుకు మద్దతు కోరామన్నారు.



తాడేపల్లి సుందరయ్య నగర్‌లో ప్రచారంలో గెడ్డన్న తదితరులు

తాడేపల్లి : కృష్ణ, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ తాడేపల్లి పట్టణం, అపార్ట్మెంట్స్, ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కుటుంబాల్లో, రాజధానిలోని ఉండవల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఆయా చోట్ల లక్ష్మణరావు అభ్యర్థిత్వం పట్ల సానుకూల స్పందన వ్యక్తం అయింది. ఈ సందర్భంగా పిడిఎఫ్ విశిష్టతను తెలియజేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద ప్రజా సంఘాలు, యూనియన్ నాయకులు వేముల దుర్గారావు, కూరపాటి స్టీవెన్, బి.సూర్యప్రకాష్, ఆశీర్వాదం, బి.అంకయ్య, ఉండవల్లి, ఉండవెల్లి అంబేద్కర్ నగర్ లో జరిగిన కార్యక్రమంలో వి.వెంకటేశ్వరరావు, ఓ.రత్తయ్య, ఓ.శ్రీనివాస్, శాంతిశ్రీ , కుమార్, చిన్నశ్రీనివాస్, సంకూర్ ఇమాన్యుల్ రాజు, కంచర్ల శేషయ్య, సంజీవ్ నగర్, పాలకంపాడు ప్రాంతాల్లో బాబురావు, డి.విజయబాబు, ఫిరోజ్ పాల్గొన్నారు. కేఎల్ రావు కాలనీ లో వెంకటేశ్వర్లు, కె.మేరీ, వి.సమేలు, బిట్ర రామారావు, డి.యోహాన్ , విఆర్ అపార్ట్మెంట్స్, అంజి రెడ్డి కాలనీ లలో దొంతి రెడ్డి విజయభాస్కర్ రెడ్డి, బుర్ర ముక్కు శివారెడ్డి, బి గోపాల్ రెడ్డి, బొజ్జ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



చిన్న కాకాని ప్రచారంలో ఈమని అప్పారావు

మంగళగిరి రూరల్ : మండలంలోని చిన్న కాకాని గ్రామంలో పిడిఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు గెలుపు కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, నాయకులు కాజ శంకరరావు, టి.బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



శాఖమూరు ప్రచారంలో ఎం భాగ్యరాజు

రాజధాని ప్రాంతంలో జోరుగా ప్రచారం

తుళ్లూరు : ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ రాజధాని అమరావతి ప్రాంతం శాఖమూరులో సిఐటియు రాజధాని డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.భాగ్యరాజ్ మాట్లాడుతూ కెఎస్ లక్ష్మణరావు శాసన మండలిలో నిర్మాణాత్మక ప్రతిపక్షంగా ఉంటూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, నిరుద్యోగులు, అంగన్వాడీ, ఆశా వర్కర్లు, వైద్య ఆరోగ్య ఉద్యోగులు, కౌలు రైతులు, గురుకులాల సిబ్బంది తదితర సమస్యల పరిష్కారానికి గళం వినిపించారని, నిబద్ధతతో పనిచేశారని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో పీఆర్సీకి సంబంధించిన పోరాటంలో ముందుండి పెద్ద ఎత్తున పోరాటాన్ని నిర్వహించారని చెప్పారు.లక్ష్మణరావును గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు.

విధులకు గైర్హాజరైతే చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజారోగ్యం దృష్ట్యా ప్రతి ఒక్కరూ కేటాయించిన పారిశుధ్య పనులకు ముందస్తు అనుమతులు లేకుండా గైర్హాజరైతే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఆదివారం నగరంలో పారిశుధ్య పనులు నిర్వహించే కార్మికులు ఎక్కువ మంది ముందస్తు అనుమతులు లేకుండా విధులకు గైర్హాజరు కావడం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. కార్మికులను ప్రలోభపెట్టి కొంత మంది అనధికార వ్యక్తులు ప్రేరేపిస్తున్నారన్నారు. గైర్హాజరైన కార్మికులకు ఆబ్సెంట్ మార్క్ చేయాలని ఇన్స్పెక్టర్లను ఆదేశించామన్నారు. ఆదివారం నగర ప్రజల నుండి పారిశుధ్య సమస్యలపై అనేక ఫిర్యాదులు అందాయని, ప్రజల ఆరోగ్యానికి మెరుగైన పారిశుధ్యం అవసరం అని, అటువంటి పారిశుధ్య పనులను ఆటంకం చేసే వారిపై తక్షణం విచారణ చేయిస్తున్నామన్నారు. విచారణ అనంతరం జిఎంసి కార్మికులు అయితే వారిపై క్రమశిక్షణ చర్యలు, అనధికార వ్యక్తులు అయితే వారిపై చట్టపరంగా పోలీస్ కేసులు నమోదు చేయిస్తామని స్పష్టం చేశారు. జిఎంసిలో విధులు నిర్వహించే కార్మికులకు ఆప్కాస్ ద్వారా జీతాలు చెల్లించడం జరుగుతుందని, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రతినెల 3వ శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ ద్వారా నేరుగా కమిషనర్ దష్టికి తెచ్చే అవకాశం కల్పించామని తెలిపారు. కార్మికులు క్షేత్రస్థాయిలగానీ, కార్యాలయంలోనైనా వారు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దష్టికి తీసుకురావచ్చున్నారు. అలా కాకుండా ఎటువంటి అనుమనుతులు, సమాచారం లేకుండా విధులకు గైర్హాజరు అయ్యే కార్మికులను ఆప్కాస్ నుండి తొలగించి, కొత్త వారిని తీసుకోవడానికి కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు.



కార్మికుల దీక్షలపై ఉదాసీన వైఖరి

ప్రజాశక్తి-తాడేపల్లి : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఆదివారానికి 75వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో వై.యహెూశోవ, కె.అక్కయ్య, వి.లక్ష్మి, డి.రమణ, బి.నవనీత కూర్చొన్నారు. దీక్షలను సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కొరుపాటి స్టీవెన్, కె.ఆదినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయసమ్మతమైన కార్మికుల సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, బి.అంకయ్య, ఎస్.కె.ఖాసిం, జి.వెంకటేశ్వర్లు, ఎం.సాంబ శివరావు, టి.దుర్గాభవానీ, వి.రిబ్కా, వి.రాణి పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న లలిత సూపర్‌స్పెషాల్టీ ఆసుపత్రి వైద్యులు

లలిత హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం తాడికొండలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 200 మంది చికిత్స పొందారని ఆసుపత్రిమేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాఘవశర్మ తెలిపారు. బి.పి, మధుమేహ పరీక్షలు, ఇసిజి, ఎకో కార్డియోగ్రామ్, కంటి పరీక్షలు, కార్డియాలజీ కన్సల్టేషన్, న్యూరాలజీ కన్సల్టేషన్, ఆప్తమాలజీ కన్సల్టేషన్ సేవలను ఉచితంగా అందించి, గుండె, నరాల సంబంధిత జబ్బుల గురించి వివరించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ క్యాంపులో కంటి వైద్య నిపుణులు డాక్టర్ బి.విజయబాబు, జనరల్ సర్జన్ డాక్టర్ ఉమాశంకర్, న్యూరాలజిస్ట్ డాక్టర్ యశ్వంత్, కార్డియాలజిస్ట్ డాక్టర్ సంగ్రామ్‌సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.



ఏసీఎంఈ పాఠశాలలో ఫుట్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

పొత్తూరులోని ఎసిఎంఇ క్యాంప్‌లో ఆదివారం ఇంటర్ స్కూల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగం అండర్ 14 పోటీలలో కొర్నెపాడు జెడ్పీ హైస్కూల్ మొదటి స్థానం, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ రెండో స్థానం, ఎసిఎంఇ స్కూల్ మూడో స్థానం సాధించాయి. అండర్-12 పోటీలలో ఎసిఎంఇ స్కూల్ మొదటి స్థానం, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ రెండో స్థానం, సెయింట్ జోసఫ్ హైస్కూల్ మూడో స్థానంలో నిలిచాయి. విజేతలను ఎంపీ కృష్ణదేవరాయలు, పాఠశాల డైరెక్టర్ సౌగంద్‌కృష్ణ నందమూరి అభినందించారు. విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలని, భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-మంగళగిరి



గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్య ంలో గుమ్మడి పుల్లేశ్వరరావు మెమోరియల్ గుంటూరు డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ బెంచ్ ప్రెస్ (మెన్, వుమెన్) ఛాంపియన్ షిప్-2025 పోటీలు ఆదివారం మంగళగిరి వైష్ణవి కళ్యాణ మండపంలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ మెడికల్ సర్వీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, మాజీ ఆప్కో చైర్మన్, మంగళగిరి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్. రంగశెట్టి నరేంద్ర, గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ చైర్మన్ ఆర్ ఎన్ వంశీకృష్ణ, అధ్యక్షులు కొమ్మాకుల విజయభాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని, వైస్ ప్రెసిడెంట్ పి.భాస్కరరావు, బి.ప్రసాద్, బోలినేని చంద్రిక, ఘట్టమనేని సాయిరేవతి, ఎస్కే మస్తాన్ వలి, పవన్ కుమార్, సందీప్, ఎన్టీఆర్ జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లేశ్వరరావు, పల్నాడు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు రాజు, ప్రధాన కార్యదర్శి పసుపులేటి సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీలలో 200 మంది గుంటూరు జిల్లా పవర్ లిఫ్టర్స్ పాల్గొన్నారు.

సుగాలీలు, ఎస్టీల అభ్యున్నతికి అండగా ఉంటాం

సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో జీవీ, ఆలపాటి

ప్రజాశక్తి - వినుకొండ

సుగాలీలు, ఎస్టీలందరికీ కూటమి ప్రభుత్వం తరపున వ్యక్తిగతంగా ఎల్లవేళలా అండగా ఉంటామని ఇచ్చారు చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజేయులు హామీ ఇచ్చారు. దేశంలోనే సుగాలీలకు ఒక ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన మహనుభావుడు సంత్‌సేవాలాల్ మహారాజ్ పేరున స్థానికంగా నిర్మించబోతున్న ఆలయానికి ఆర్థికంగా, అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. ఆలయంతోపాటు కల్యాణమండపం కూడా నిర్మించుకోవాలని, అందుకోసం ప్రభుత్వం నుంచి రూ.25 లక్షలు, వ్యక్తిగతంగా రూ. 5లక్షలు అందిస్తామన్నారు. పల్నాడు ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోటా నుంచి కూడా నిధులు తెచ్చుకునే ప్రయత్నం చేద్దామన్నారు. వినుకొండ పట్టణం వెల్లటూరు రోడ్డులో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, కృష్ణా-గుంటూరు కూటమి తరపున ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన చీఫ్ విప్ జీవీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఆయన జీవిత చరిత్ర, బోధనలను స్మరించుకున్నారు. సంత్‌సేవాలాల్ పేరున గుడి కట్టాలన్న నిర్ణయం చాలా మంచి విషయమన్నా రు. పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలవబోతున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ ద్వారా ఇలాంటి కార్యక్రమాలకు మంచి నిధులు తెచ్చుకునే అవకాశం ఉంటుందని గమనించాలని



కోరారు. వినుకొండ నియోజకవర్గంలో వినుకొండ టౌన్ మండలం తర్వాత బొల్లాపల్లి మండలంలోనే అత్యధిక పట్టభద్రుల ఓట్లు ఉన్నాయని, వారంతా ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



సాగరమాత ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

స్థానిక సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ విచారణ గురువు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ మాట్లాడుతూ సర్వ మానవ పాపాలను తొలగించేందుకు దైవ కుమారుడైన ఏసుక్రీస్తు మానవరూపాన్ని ధరించి సమస్త జీవకోటి ఆచరించాల్సిన విధి, విధానాలను వెలుగులోకి తెచ్చారని వెల్లడించారు. ఏసుక్రీస్తు సూచించిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు. దైవ సందేశాన్ని పాటించి సమాజంలో మంచి వ్యక్తులుగా గుర్తింపు పొందాలని చెప్పారు. అనంతరం దివ్యబలి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భక్తులు భారీగా పాల్గొన్నారు.



పోస్టల్ బీమా లబ్ధిదారుకు చెక్కు అందజేత

ప్రజాశక్తి- చిలకలూరిపేట

స్థానిక ప్రధాన తపాలా కార్యాలయంలో పోస్టల్ సూపరింటెండెంట్, ఇండియా పోస్ట్ బ్యాంక్ మేనేజర్ మహేష్ రెడ్డి చేతుల మీదుగా పోస్టల్ ప్రమాద బీమాకు సంబంధించిన రూ.10 లక్షల చెక్కును వెంగళరెడ్డి నగర్‌కు చెందిన షేక్ ఆదంబికి ఆదివారం అందజేశారు. కొంతకాలం కిందట పోస్టాఫీస్‌లో ప్రమాద బీమా పాలసీ తీసుకున్న షేక్ బాజీ సాహెబ్ రోడ్డు ప్రమాదంలో మరణించగా.. ఆయన భార్య అయిన షేక్ ఆదంబికి చిలకలూరిపేట హెడ్ పోస్ట్ ఆఫీస్‌లో అందజేశారు. కార్యక్రమంలో చిలకలూరిపేట పోస్టల్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాద్, పోస్ట్ మాస్టర్ తోట శ్రీరామకృష్ణ, ఎంవో వెంకంరాజు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ నిర్వహణపై సమీక్ష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వచ్చే నెల 8న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌కు సంబంధించి స్థానిక న్యాయస్థాన భవనాల ఆవరణలో వివిధ శాఖల అధికారులతో న్యాయాధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మార్చి 8న స్థానిక న్యాయస్థాన ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, నరసరావుపేట 13 అదనపు జిల్లా న్యాయాధికారి ఎన్.సత్యశ్రీ తెలిపారు. అదాలత్‌లో పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు. రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవడానికి చట్టపరమైన అంశాలను వివరించారు. కార్యక్రమంలో న్యాయధికారులు కె.మధుస్వామి, ఆర్.ఆశీర్వాదం పాల్, న్యాయవాద సంఘ ప్రతినిధులు, ఇన్సూరెన్స్, ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్

ప్రజాశక్తి - మాచర్ల



పురపాలక సంఘ పరిధిలోని సమస్యల పరిస్కారానికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. పారిశుధ్య, తాగునీరు తదితర సమస్యలుంటే 7093128044 ఫోన్ నంబర్‌కు తెలియజేస్తే తక్షణం పరిష్కరిస్తామని చెప్పారు.

రోడ్డు వేశారు... దోనె పూడ్చారు



ప్రజాశక్తి-ఈపూరు

తారు రోడ్డుపై పడిన గుంతలను మరమ్మతులు చేపట్టే క్రమంలో మురుగునీరు పారే దోనెను పూడ్చడంతో మురుగు నీరు రోడ్డుపై పారుతూ దర్శనమిస్తున్నాయి. మండలంలోని కొచ్చర్ల గ్రామంలో వినుకొండ- కారంపూడి ప్రధాన రహదారిలో తారు రోడ్డుపై పడిన గుంతలను 20 రోజుల క్రితం మరమ్మతులు చేసి పూడ్చారు.సైడు కాలువలో మురుగునీరు తారు రోడ్డు అవతల వైపుకు కాలువకు అనుసంధానం చేస్తూ రోడ్డు కింది భాగంలో గతంలో సిమెంట్ దోనె ఏర్పాటు చేశారు. కాలువలో మురుగునీరు దోనె ద్వారానే ముందుకు వెళ్లేయి.దోనె కు రంధ్రాలు పడినప్పటికీ పంచాయతీ వారు పట్టించుకోకపోవడంతో చాలాకాలంగా మురుగునీరు పారేలా స్థానిక ప్రజలే తాత్కాలిక మరమ్మతులు చేసుకునేవారు.తారు రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టిన సిబ్బంది పగిలిన దోనె పై కంకర పోసి గుంతలను పూడ్చి మరమ్మతులు చేపట్టడంతో దోనె పూర్తిగా పూడిపోయింది. దీంతో మురుగు నీరు ముందుకు పోయే దారి లేక రోడ్డుపై పారుతు దుర్వాసన వెదజల్లుతూ పరిసర ప్రాంతాలలో ఉండటం కష్టంగా మారింది. మురుగునీరు నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు .అలాగే ద్విచక్ర వాహనదారులు మురుగు నీటిలో రోడ్డు దాటడం ఇబ్బందిగా మారింది. భారీ వాహనాలు రోడ్డు దాటే సమయంలో మురుగునీరు చింది మీద పడుతున్నాయని దుకాణదారులు తెలిపారు.ఇప్పటికైనా ఆర్ అండ్ బి,పంచాయతీ అధికారులు సమన్వయం చేసుకొని కొత్త దోనె ఏర్పాటుచేసి మురుగునీరు పారేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.


మహిళ కడుపులో అయిదు కిలోల కణితి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మహిళ కడుపులో ఉన్న 5 కిలోల కణితిని శస్త్ర చికిత్స నిర్వహించి విజయవంతంగా తొలగించిన ఘటన పట్టణంలోని దత్తసాయి నర్సింగ్ హోం నందు ఆదివారం చోటు చేసుకుంది. దత్తసాయి నర్సింగ్ హెూమ్ వైద్యులు వి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన సిహెచ్ పార్వతి అనే మహిళ 15 రోజులుగా కడుపు నొప్పితో బాధ పడుతూ శనివారం చికిత్స నిమిత్తం దత్తసాయి నర్సింగ్ వైద్యులను సంప్రదించింది. పరీక్షలు నిర్వహించి పార్వతి కడుపులో 5కేజీల కణితి ఉన్నట్లుగా నిర్ధారించారు .వైద్యులు శ్రీనివాసరావు, ఎంఎస్ జనరల్ సర్జన్ ఎం.లలిత ఆదివారం శస్త్ర చికిత్స నిర్వహించి మహిళ కడుపులో ఉన్న కణితిని విజయవంతంగా తొలగించారు. తొలగించిన కణితి అయిదు కిలోలలకు పైగా ఉందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం పార్వతి ఆరోగ్యం నిలకడగా ఉందని వారు తెలిపారు. గతంలో అనేకసార్లు ఇటువంటి



శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించామని వైద్యులు శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా బాధితురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.



డాక్టరేట్ అందుకుంటున్న బాలచంద్

బాలచంద్‌కు డాక్టరేట్ డిగ్రీ ప్రదానం

ప్రజాశక్తి-పెదకూరపాడు

పెదకూరపాడు గ్రామానికి చెందిన కోయ బాలచంద్‌కు కు ప్రతిష్టాత్మక పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీని శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వమాహా విద్యాలయం ప్రదానం చేసింది. ఈ డిగ్రీని ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ జి. సీతారామ్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. నిర్మాణ ఇంజినీరింగ్ రంగంలో చేసిన విశేష పరిశోధనకు గానూ ఈ గుర్తింపు లభించింది. ప్రస్తుతం ఆయన బీవీ రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నర్సాపూర్ మెదక్‌లో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనకు తోటి అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు. ఇదే స్పూర్తితో మరిన్ని పరిశోధనలు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

వైసీపీ మాజీ మంత్రి విడదల రజిని మామ కారుపై దాడి

ప్రజాశక్తి-చిలకలూరిపేట



వైసీపీ నేత, మాజీ మంత్రి విడదల రజని కుటుంబ సభ్యుల పై ఆదివారం సాయంత్రం దాడి జరిగింది. ఆమె మామ చిలకలూరిపేట మాజీ యార్డు చైర్మన్ విడదల లక్ష్మీనారాయణ కారు పై గుర్తు తెలియని వ్య క్తుకు దాడికి పాల్పడ్డారు. విడుదల లక్ష్మీనారాయణ కారు డ్రైవర్ పు రుషోత్త పట్నం లోని ఆయనకి వద్ద నుంచి షుమారుగా 2,3 గంటల సమ యంలో కారును తీసుకొని చిలక లూరిపేట వైపు వస్తున్నారు. ఆ సమయంలో గ్రామంలో పురుషోత్తమ పట్టణంలోని వేణుగోపాలస్వామి గుడి దాటిన తరువాత రాళ్లతో వెనక నుంచి ఈ దాడి జరిగింది. కారు అద్దాలు పగిలాయి. కారు డ్రైవర్‌కి అతి స్వల్పంగా గాయాలు అయ్యాయి. ఆ సమయంలో కారులో లక్ష్మీనారాయణ లేరని తెలుస్తోంది. ఈ విషయమై పోలీసులకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. వారు ఈ విషయమై మాకు ఎటువంటి సమాచారం లేదంటున్నారు. ఇటీవల ఎమ్మెల్యే పుల్లారావు, రజనీ ఒకరి పై ఒక రు సవాళ్ల విసురుకున్న విషయం తెలిసిందే. వ్యాఖ్యానిస్తున్నాయి.

పంట కాలువ పాడవుతోన్నా.... పట్టించుకోరా?



వ్యర్థాలు, మురుగునీటితో నిండిన పంట కాల్వ



పరిశీలిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

డ్రెయినేజీగా మారిన పంట కాలువ... అధికారుల నిర్లక్ష్యమే కారణమా?
పంట కాలువను పరిరక్షించండి : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

పచ్చని పంట పొలాలకు నీరందించి, రైతు మోములో పసిడి కాంతులు నింపే పంట కాలవ నేడు మురుగు నీటి కాలువలా మారింది. తాడేపల్లి పరిసర ప్రాంతాల గ్రామాలలో పంట కాలువ పక్కన ఉన్న బహుళ అంతస్తుల భవనాలలో వ్యర్థాలు, మురుగు నీరుతో పంట కాలువ నిండు తుండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి ఆంధ్ర రత్న పంపింగ్ స్కీం పంట కాలవ దుస్థితి రోజు రోజుకీ అధ్వాన్నంగా తయారవుతోంది. ఒకప్పుడు పంట పొలాలకు నీరు అందించిన కాలువ నేడు మురుగునీరు పారిస్తోంది. మూడేళ్లుగా వ్యర్థాల తో కాలువ పూడుకుపోతున్నా సంబంధిత అధికారు లు పట్టించుకోవడం లేదు. తాడేపల్లి మండలంలోని కుంచన పల్లి, ప్రాతూరు, గుండిమెడ, చిర్రా వూరు గ్రామాల రైతులు తమ పంట పొలాలల్లోకి మురుగునీరు చేరుతోందని గగ్గోలు పెడుతున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. సాగునీటి కాల్వలో మురుగునీరు వచ్చి చేరడంతో పంటలన్నీ దెబ్బతింటున్నాయి. ఇటీవల రైతు సంఘం నాయకులు ఆంధ్రరత్న పంపింగ్ స్కీం వద్ద పంట కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివ శంకరరావు మాట్లాడుతూ 1967న ఆంధ్రరత్న పంపింగ్ స్కీంపంట కాలువను రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేశారని చెప్పారు. సుమారు మూడువేల ఎకరాలకు నీరు అందిస్తున్న పంట కాలువలో ఇపుడు మురుగు నీరు వచ్చి చేరడంతో పంటలు దెబ్బ తింటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పంట దిగుబడులు తగ్గి, చీడపీడలు వ్యాప్తి చెంది రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపో యారు. మురుగునీటి వల్ల భూములన్నీ చౌడుగా మారి, పంటలు దెబ్బ తిన డమే కాక, రైతులు వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా కుంచన పల్లి ప్రాంతంలో పంట కాలువకు రెండు వైపులా బహుళ అంతస్తుల భవనాలు, వ్యాపార సంస్థలు నిర్మించడంతో అక్కడి నుంచి మురుగునీటితో పాటు వ్యర్థాలు వచ్చి కాల్వలో చేరు తున్నాయన్నారు. ఈ నీటిని పంట కాలువలో కలిపేందుకు నాలుగు అంగుళాల పైపులు వేసినా ఫలితం లేదనీ, నీరంతా కలుషితం అవు తున్నా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. పరిసరాలలో వాడిన వ్యర్థపు నీటిని బయటకు పంపేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువను పరి రక్షించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లెకృష్ణ, సిఐటియు తాడేపల్లి మండల నాయకులు డి.వెంకటరెడ్డి, రైతు నాయకులు ఏ. రంగారావు ఉన్నారు.



రామ శాస్త్రిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ, అతిథులు

రామశాస్త్రికి ఘన సన్మానం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఉద్యోగులు నిబద్ధతతో పనిచేస్తేనే వారికి తగిన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం తెలి పారు. పంచాయతీరాజ్ శాఖలో సుదీర్ఘకాలం పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన జి.సీతారామశాస్త్రికి ఆదివారం స్థానిక రెడ్డి పాలెంలోని ఒక ఫంక్షన్ హాలులో సన్మానం జరిగింది. ఈ సంద ర్భంగా జరిగిన సభలో ఏసురత్నం ప్రసంగించారు. ప్రభుత్వ సర్వీసుల్లో నిజాయితీగా పనిచేసిన సీతారామ శాస్త్రిని ఆయన అభినందించారు. మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ, మాజీ ఎంపి వేణుగోపాలరెడ్డి వద్ద పర్సనల్ సెక్రటరీగా ప్రజలతో మమేకమై పనిచేశారని పలువురు వక్తలు కొని యాడారు. సభలో మోపిదేవి వెంకటరమణ, మోదుగుల వేణు గోపాల రెడ్డి శాస్త్రిని ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు.



స్టీవెన్‌పాల్ దంపతులను సత్కరిస్తున్న సంఘ సభ్యులు

డాక్టరేట్ అందుకున్న స్టీవెన్ పాల్‌కు సత్కారం

ప్రజాశక్తి - తెనాలి

ఇటీవల డాక్టరేట్ అందుకున్న దైవ సేవకులు కె స్టీవెన్ పాల్‌ను సంఘ సభ్యులు ఆదివారం సత్కరించారు. స్టీవెన్ పాల్ 35 సంవత్సరాలు పాస్టర్‌గా సేవలందిం చారు. ఇటీవల నెల్లూరు జిల్లా కందుకూరులో బాప్టిస్ట్ మిషన్ ఆధ్వ ర్యంలో పలువురు దైవ సేవకులకు డాక్టరేట్ ప్రదానం చేశా రు. అందులో భాగంగా స్టీవెన్ పాల్ కూడా డాక్టరేట్ అందు కున్న సందర్భాన్ని పురస్కరించుకొని కొలకలూరు కరుణా నిలయం బాప్టిస్ట్ చర్చ్ సభ్యులు ఆయనను సత్కరించారు. కె జార్జ్‌థామస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పిబి విజయ కుమారి, ఎ.బ్యూలా ఇవాంజిలిన్, ఎం చైతన్య, ఎస్.వినయ్ కుమార్, కె.కిరణ్మయి, ఎం.లక్ష్మీ కరుణ కుమారి, ఎస్ సుజాత, ఏ విజయరాజేందర్, ఎం.హెూలి పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారు

ఏపీ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరిలోని ఆర్ అండ్ బి గెస్ట్‌హౌస్ ఎదు రుగా ఉన్న విజెపి అండ్‌డిఎల్ బి డిగ్రీ కాలేజ్లోని ఫంక్షన్ హాల్ లో ఆదివారం నిర్మల జూనియర్ కాలేజ్ ఫేర్ వెల్ పార్టీ ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ చదువుల్లో రాణించి ఉజ్వల భవిష్యత్తుకు బాటవేసుకోవాలనిఅన్నారు. తల్లిదండ్రుల ఆలోచనలతో విద్యను అభ్యసించి వారి ఆశయాలను నెరవేర్చాలని అన్నారు. నిర్మలా జూని యర్ కళాశాల డైరెక్టర్ వివి ప్రసాద్ మాట్లాడుతూ మంగళ గిరి పరిసర ప్రాంతాల్లో నిర్మలా జూనియర్ కళాశాల స్థాపిం చి వేలమంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దామని చెప్పారు. ఈ విద్యా సంవత్సరం లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన టాపర్లకు, క్రీడల్లో రాణిం చిన క్రీడాకారులకు చిల్లపల్లి శ్రీనివాసరావు చేతుల మీదుగా జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో విజేపీ అండ్ డిఎల్‌బి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డి.శ్రీనివాసరావు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ వివి జవహర్‌లాల్, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.



విజేతలకు జ్ఞాపికలను అందజేస్తున్న శ్రీనివాసరావు, కళాశాల డైరెక్టర్ వివి ప్రసాద్



మాట్లాడుతున్న డాక్టర్ మారుతీనందన్

హోమియో వైద్యంపై అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజలు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలన్నింటికీ హోమియో వైద్యంలో మందులు ఉన్నాయని, చిన్నా పెద్దా అందరూ హోమియో వైద్యంతో ఆరోగ్యంగా, ఆనందంగా ఉండ వచ్చని ప్రముఖ హోమియోపతి వైద్యులు డాక్టర్ ఉప్పాల మారుతీనందన్ అన్నారు. ఆదివారం అరండల్ పేటలోని అవగా హన కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఆరోగ్య సభలో డాక్టర్ మారుతీనందన్ మాట్లా డుతూ హోమియో వైద్య విధానం సమగ్రమైనదని నన్నా రు. అతి తక్కువ వ్యయంతో ఈ వైద్య విధానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆహార నియమాలు పాటిం చాలన్నారు. సభ్యుల సందేహాలను డాక్టర్ నందన్ నివృత్తి చేశా రు. పాపి రెడ్డి, శ్రీనివాసరావు, ఇందుశేఖర్ ప్రసంగించారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఫార్మసీ విద్యార్థినిలు

జీవనశైలిలో మార్పులతో హార్మోన్ల సమస్యను అధిగమించవచ్చు

ప్రజాశక్తి - దుగ్గిరాల

జీవనశైలిలో మార్పు చేసుకోవడం ద్వారా హార్మోన్ల అసమతౌల్యం ద్వారా వచ్చే అనారోగ్యం నుండి కాపాడుకో వచ్చునని కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్ సుప్రియ అన్నారు. మండలంలోని శంగారపురం గ్రామంలో ఆదివారం ఫార్మసీ విద్యార్థినులతో కలిసి మహిళలకు హార్మోన్ల సమతుల్యం లోపించటం వలన వచ్చే అనారోగ్యం గురించి ఇంటింటికి తిరిగి అవగాహన కల్పిం చారు. ఆహారంలో మార్పులు సరైన సమయంలో నిద్ర పోవటం భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడం యోగ మరియు మెడటేషన్ ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించుకొని జీవనశైలిలో మార్పు తీసుకురావడం వలన హార్మోన్ల సమస్య ను అధిగమించవచ్చునని తెలిపారు.

ఆలయ ఆవరణలో శిశుస్థన్యపాన ప్రాంగణం ఏర్పాటు

ప్రజాశక్తి - మంగళగిరి

శ్రీపానకాల లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం మంగళగిరి రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శిశు స్థన్యపాన ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ కె.శరత్ చౌదరి దంప తులు ఆదివారం ఈ ప్రాంగణాన్ని లాంఛనంగా ప్రారంభిం చారు. తొలుత శరత్ చౌదరి దంపతులు శ్రీపానకాల లక్ష్మీ నరసింహస్వామి దిగువ సన్నిధిని సందర్శించారు. అనంత రం మీడియాతో మాట్లాడారు. మంగళగిరి రోటరీ క్లబ్ వారు రెండు గొప్ప ప్రాజెక్టులు చేపట్టడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన శిశుస్థన్య పాన ప్రాంగణం మహిళలకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పదోతరగతి తర్వాత కెరీర్ గైడెన్స్ పుస్తకాలు, పోస్టర్లు అందిస్తున్నారని అన్నారు. తదుపరి చినకాకాని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కెరీర్ గైడెన్స్‌చార్టును శరత్ చౌదరి లాంఛ నంగా ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ పదో తరగతి తర్వాత ఏ కోర్సులు చేయాలనే పూర్తి వివరాలను అందుబాటులో ఉంచిన రోటరీ క్లబ్ వారిని ప్రశంసించారు. మంగళగిరి నియోజకవర్గంలో మొత్తం 13 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కెరీర్ గైడెన్స్‌కు సంబంధించిన చార్టులను ఏర్పాటు చేస్తున్నట్లు చార్టర్ ప్రెసిడెంట్ అనిల్ చక్రవర్తి తెలిపారు. కార్యక్రమాల్లో మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షులు గాజుల శ్రీనివాసరావు, కార్యదర్శి అందే మురళి, రోటరీ డిప్యూటీ గవ ర్నర్ పాటిబండ్ల శివరంజని, అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ వంశీకృష్ణ మాజేటి, రొటేరియన్లు కందిమళ్ల స్వప్న, పారేపల్లి నిరంజన్ గుప్తా, కందుకూరి రాజ్‌కుమార్, తుల్లిమిల్లి రామకృష్ణ, అందె రేవంత్‌కుమార్, కౌతరపు వేణు, కేవీఎస్ ప్రకాశ రావు, కాపరౌతు సుందరయ్య, జొన్నాదుల భిక్షారావు, క్రాంతికుమార్, బట్టు నారాయణరావు, బి. వెంకటేశ్వరరావు, త్రిపురమల్లు సతీష్ బాబు పాల్గొన్నారు.



శిశు స్థన్యపాన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శరత్ చౌదరి



తుళ్లూరులో మెగా వైద్య శిబిరం

143 మందికి వైద్యసేవలు

ప్రజాశక్తి - తుళ్లూరు

బండ్ల ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రేష్ఠ హాస్పిటల్ వారి సహకారంతో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటైంది. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో హెచ్ ఎస్ ఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన శిబిరంలో వైద్యులు 143 మందికి ఉచిత వైద్య పరీక్షలు జరిపారు.78 మందికి ఈసీజీ, 74 మందికి బోన్ మ్యారో వంటి ఆరోగ్య పరీక్షలు నిర్వ హించి ఉచితంగా మందులు అందజేశారు. బండ్ల ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గతంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించినట్లు ట్రస్ట్ ఛైర్మన్ బండ్ల పట్టాభి రామయ్య చెప్పారు.కార్యక్రమంలో అమరా వతి జెఎసి కన్వీనర్ పువ్వాడ సుధాకరరావు, టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీ బండ్ల కోటేశ్వరరావు, గ్రామ అధ్యక్షులు కాటా అప్పారావు, గడ్డం వెంక టేశ్వరరావు, బండ్ల శ్రీనివాసరావు, జె.అనిల్, కొమ్మి నేని సత్యనారాయణ, జె. శంకరరావు, యం.రాంబాబు పాల్గొన్నారు.

చందూస్ క్రికెట్ టోర్నీ విజేతగా ఎస్ఆర్‌కెఆర్ జట్టు

ప్రజాశక్తి-గుంటూరు


విజేతలను అభినందిస్తున్న రాయపాటి శ్రీనివాస్

కళాశాల అధ్యాపకుల కోసం జెకెసి కాలేజి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 28వ చందూస్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లో ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కాలేజి భీమవరం జట్టు విజేతగా నిలిచింది. ఎస్ఆం ^కెఆర్, ఎస్ఆర్ఎం యూని వర్సిటీ మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్ఆర్ఎం నిర్ణీత 20వ ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 136 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఎస్ఆర్‌కెఆర్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 137 పరుగులు చేసి, విజయం సాధించింది. అనంతరం బహుమతి ప్రధానోత్సవం నిర్వహించారు. ఉత్తమ బ్యాట్స్‌మెన్‌గా ఎస్ఆర్ఎం నుంచి సంతోష్, ఉత్తమ బౌలర్‌గా ఎస్ఆర్‌కెఆర్ నుంచి సుబ్బరాజు, ఆల్‌రౌండర్‌గా ఎస్ఆర్ఎం నుంచి ఉదయ్ ఎంపికయ్యారు. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నాగార్జునా ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, జెకెసి కాలేజి కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్, జెకెసి కాలేజి ఆఫ్‌లా కార్యదర్శి కుప్పుస్వామి, కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపిచంద్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.సాంబశివరావు పాల్గొన్నారు.

ఆర్‌విఆర్ జెసిలో నేటి నుండి నేషనల్ బూట్ క్యాంపు

ప్రజాశక్తి-గుంటూరు


కళాశాలను సందర్శించిన ఎఐసిటిఇ బృందం

అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏ.ఐ.సి.టి.ఈ), మినిస్ట్రీ ఆఫ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సంయుక్త సహకారంతో, సౌత్ ఇండియా రీజియన్ పరిధిలో ఆర్.వి.ఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో సోమవారం నుండి ఐదు రోజుల పాటు నిర్వహించనున్న ఇన్నోవేషన్ డిజైన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ బూట్ క్యాంపు ఏర్పాట్లను ఏఐసిటిఈ బృందం ఆదివారం పరిశీలించింది. డాక్టర్ ఇంజనాగ భీమలింగేశ్వర్‌రెడ్డి తదితరులున్నారు. ఈ శిబిరంలో వివిధ రాష్ట్రాల నుండి విద్యార్థులు పాల్గొని వారు రూపొందించిన వివిధ రకాల నూతన ఆవిష్కరణలను ప్రదర్శించనున్నారు. కావున వారికి అవసరమైన సాంకేతిక సౌకర్యాలు, వసతి ఏర్పాట్లను బృందం పరిశీలించింది. అనంతరం వారు కళాశాల సిబ్బందితో సమావేశమై ఏర్పాట్లపై సమీక్షించారు. పలు ప్రాంతాల ఆవిష్కర్తలు తమ కళాశాల వేదికగా వారి ఆలోచనలను పంచుకునేందుకు రావడం శుభ పరిణామమని ఆర్.వి.ఆర్ అండ్ జె.సి.ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్ల మూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని ప్రకటనలో తమ హర్షం వ్యక్తం చేశారు. సాంకేతిక రంగంలో భారత్‌ను ప్రపంచ దేశాల్లోనే అగ్రస్థానంలో నిలిపేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

నీతి అయోగ్ నివేదికలో అట్టడుగున ఆంధ్రప్రదేశ్

రిటైర్డ్ ఐఎఎస్ అధికారి డాక్టర్ పివి రమేష్

ప్రజాశక్తి-గుంటూరు


మాట్లాడుతున్న డాక్టర్ పి.వి.రమేష్

నీతి అయోగ్ ఫిస్కల్ హెల్త్ ఇండెక్స్‌లో 18 రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ 17వ స్థానంలో ఉందని ప్రముఖ ఆర్థిక నిపుణులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పూర్వ స్పెషల్ చీఫ్ సెక్రటరి డాక్టర్ పి.వి.రమేష్ అన్నారు. జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరులోని జనచైతన్య వేదిక సమావేశ మందిరంలో 'ఆంధ్రలో ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించేది ఎలా' అనే అంశంపై చర్చాగోష్టి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యవక్తగా పాల్గొన్న డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ఆర్థిక ఆరోగ్య స్థితిపై నీతిఅయోగ్ ఇచ్చిన నివేదిక ఆంధ్రప్రదేశ్ అప్పుల సూచికలో అగ్రస్థానంలో ఉందని, అప్పులు తీర్చే విషయంలో జీరో మార్కులు ఇచ్చిందని తెలిపారు. 2014 నుండి 2023 వరకు ఆంధ్రప్రదేశ్ ప్రతి ఏటా 20 శాతం అదనంగా అప్పులు చేయాల్సి వచ్చిందని, మరోవైపు వచ్చే రాబడి ప్రతి ఏటా 6 శాతం వరకు తగ్గుతూ వచ్చిందన్నారు. గత 10 ఏళ్లలో రాష్ట్ర బడ్జెట్‌లో పెట్టుబడి వ్యయం 4 శాతానికే పరిమితమైందన్నారు. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రాజకీయ సంక్షోభాలతో ఆంధ్రప్రదేశ్ కొట్టుమిట్టాడుతుందన్నారు. ప్రధాన రాజకీయ పార్టీలు ఏక వ్యక్తి కంపెనీగా మారుతూ ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేశాయన్నారు. ప్రజలలో మార్పు, చైతన్యాన్ని తీసుకుని వచ్చే సందేశాత్మక చిత్రాలు తెలుగులో రావడం లేదని, తమిళ, మలయాళ చిత్రాలను స్ఫూర్తిగా తీసుకొని సాంస్కృతిక చైతన్యాన్ని తీసుకు రావాలన్నారు. కొందరు లక్షలాది కోట్ల రూపాయల బ్యాంకు రుణాలను ఎగవేస్తూ బిలినీయర్లగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ ప్రధాన పార్టీలు గెలుపు కోసం ఉచితాలను ప్రజలు అడగకుండానే ప్రకటిస్తున్నారని అన్నారు. నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధిని మాత్రమే ప్రజలు కోరుకుంటున్నారని, ఉచితాలను కాదని వివరించారు. రాష్ట్రాలు ఇస్తున్న ఉచితాలను నిత్యం విమర్శించే బిజెపి ప్రభుత్వం ఇటీవల జరిగిన ఢిల్లీ ఎన్నికలలో అంతకు మించి ఉచితాలను ప్రకటించడం ద్వంద్వ నీతికి నిదర్శనం అన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ ఆంధ్రప్రదేశ్ అప్పుల ఊబిలో కూరుకపోయిందని, అప్పులు తీర్చడానికి అప్పులు చేసే స్థితికి చేరుకుందన్నారు. నీటిపారుదల ప్రాజెక్టులు పాలకులకు అవినీతి పారుదల ప్రాజెక్టులుగా మారుతున్నాయని, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న 31 నీటిపారుదల ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని తద్వారానే సంపద సృష్టి జరుగుతుందన్నారు. విద్యుత్ ప్రాజెక్టులలో కుంభకోణాలపై అదాని, షిర్డీసాయి ఎలక్ట్రికల్స్‌లపై విచారణ జరగాలన్నారు. చర్చాగోష్టిలో తణుకుకు చెందిన స్వాతి కన్‌స్ట్రక్షన్ కాంట్రాక్టర్ కెవిఎస్ బుచ్చిరాయుడు, పరిశ్రమల శాఖ పూర్వ అడిషనల్ డైరెక్టర్ ఎ.వి. పటేల్, నేస్తం సహ వ్యవస్థాపకులు టి. ధనుంజయ రెడ్డి, రాజ్యాంగ చర్చా వేదిక కార్యదర్శి అవధానుల హరి, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పరమేశ్వర రెడ్డి, ఎగుమతుల విభాగ పూర్వ జాయింట్ డైరెక్టర్ జిఎస్ రావు తదితరులు ప్రసంగించారు.

నిర్లక్ష్యపు నీడలో రుద్రమదేవి కాలం నాటి శాసనం

ప్రజాశక్తి- మాచర్ల

నిర్లక్ష్యానికి గురైన కాకతీయ మహారాణి రుద్రమదేవి కాలం నాటి శాసనాన్ని పరిరక్షించుకోవాలని మాచర్ల పట్టణానికి చెందిన చరిత్ర పరిశోధకులు, రచయిత పావులూరి సతీష్‌బాబు అన్నారు. పట్టణం నుండి జమ్మలమడక రహదారిలో పొలం వద్ద, రామప్పగుడి బయట ఉన్న విరిగిన శాసన బండను సతీష్ బాబు గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తి శాసన బండలో ఒక ముక్క పొలం గట్టు వెంబటి పడి ఉందని, దీని తాలూకూ మరో అవశేషం దేవాలయ ఆవరణలోని ఆరుగుపై నిర్లక్ష్యంగా పడి ఉందన్నారు. ఈ శాసనం శాలివాహన శకం 1210 క్రీ.శ. 1288 ఏప్రియల్ 18 న ప్రతిష్ఠించినట్లు తెలిపారు. రుద్రమదేవి సేవకుడు బొల్నాయిని కుమారుడు మల్లిఖార్జుననాయకుడు రామనాథ దేవరకు మెట్ట,మాగాణి భూములు దానమిచ్చినట్లు ఆ శాసనంలో ఉందన్నారు. ఈ శాసనాన్ని పురావస్తు శాఖ వారు 1942లో నకలు తీశారని, ఆ తరువాత నిర్లక్ష్యానికి గురై శాసనం రెండుగా ముక్కులగా పగిలిపోయి ందన్నారు. పొలం గట్టు వద్ద ఉన్న విరిగిన శానన బండను, దేవాలయ ఆవరణలోని అరుగుపై నిర్లక్ష్యంగా పడి వున్న మరోబండను ఒక్కచోటకు చేర్చి ఆలయ ఆవరణలో ప్రతిష్టించి, మన వారసత్వ సంపదను కాపాడుకోవాలని దేవాలయ కమిటి సభ్యులకు సతీష్ సూచించారు. వీరి వెంట ఉప్పుతోళ్ళ రమేష్, ఓరుగంటి చెన్నకేశవరావులున్నారు.


విరిగిన శాసన బండను పరిశీలిస్తున్న పరిశోధకులు సతీష్‌బాబు

నిర్లక్ష్యం ఖరీదు నిండు ప్రాణం

- అతివేగం ప్రాణాంతకం - ప్రమాదాల నివారణకు అవగాహన సదస్సులు
- ద్విచక్ర వాహనంపై ప్రయాణించే ఇరువురూ హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తితో పల్నాడు జిల్లా రవాణా అధికారి జి.సంజీవ్ కుమార్

రోడ్లు భద్రత, ప్రమాదాల నివారణకు పలు చర్యలు చేపట్టినట్లు పల్నాడు జిల్లా రవాణా అధికారి జి.సంజీవ్ కుమార్ అన్నారు. వాహనదారులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు 36వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పల్నాడు జిల్లాలో విజయవంతంగా నిర్వహించామని, పోలీస్, ట్రాఫిక్ పోలీస్, ట్రాన్స్పోర్ట్ విభాగాల అధికారులతో కలిసి రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించి చైతన్యం నింపామని ప్రమాదాల నివారణకు మాసోత్సవాలకే పరిమితం కాకుండా ప్రమాదాల రహిత పల్నాడు జిల్లా సాధనకు తమ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ నిత్యం అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. అతి వేగం ప్రమాదకరమని రోడ్డుపై ప్రయాణం చేసే ప్రతి వాహనదారుడు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతా చర్యలు గురించి ప్రజాశక్తి కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.





36 జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు ఏ విధంగా నిర్వహించారు?

పల్నాడు జిల్లాలో 20కి పైగా పాంశాలలు, కళాశాలలలో విద్యనభ్యసిస్తున్న 1 లక్ష మందికి పైగా విద్యార్థులకు 36 వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించాం. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ట్రాఫిక్ నియమాలు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించాం. అదేవిధంగా విద్యార్థులు వారి తల్లిదండ్రులకు, స్నేహితులకు కూడా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని సూచించాం. ప్రధాన పట్టణాలలో ర్యాలీలు నిర్వహించాం.

పాఠశాలలు, కళాశాలల్లో సదస్సులు నిర్వహించడానికి ప్రత్యేక కారణాలున్నాయా?

ప్రస్తుతం ప్రమాదాల బారిన పడుతున్న వారిలో 17,18 ఏళ్ల వయసు నుండి 20,21 ఏళ్ళ యువత అధిక సంఖ్యలో ఉంటున్నారు. విద్యార్థులు తమ పాఠశాల, కళాశాల జీవితంలో ఏదైతే నేర్చుకుంటారో ఆ అంశాలు వారి జీవితమంతా గుర్తుండి పోతాయి అనే విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పాఠశాలలు కళాశాలల్లోని విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల తీవ్రత, ప్రమాదాల బారిన పడకుండా వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించాము. డ్రైవింగ్ లైసెన్స్ లకు ఎప్పుడు ఎలా దరఖాస్తు చేసుకోవాలి, పిల్లలు లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే వారి తల్లి దండ్రులకు ఎలాంటి శిక్షలు ఉంటాయి, నిర్లక్ష్యం ఖరీదు నిండు ప్రాణమని, అతి వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ అత్యంత ప్రమాదకరని విద్యార్థులకు అవగాహన కల్పించాం.

పల్నాడు జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా ఏ ప్రాంతాల్లో జరుగుతున్నాయి ?

పల్నాడు జిల్లాలో వినుకొండ పట్టణంలోని మార్కాపురం రోడ్డు, మండలంలోని చీకటిగల పాలెం, అద్దంకి నార్కెట్ పల్లి రాష్ట్రీయ రహదారి మార్గంలో రొంపిచర్ల, నకరికల్లు, శావల్యాపురం, నరసరావుపేట మండలాల్లో మండలం రావిపాడు రోడ్డు, నుదురుపాడు బైపాస్ రోడ్లలో ఎక్కువగా ప్రమాదాలు జరుగు తున్నట్టు గుర్తించడం జరిగింది. ఆయా ప్రాంతాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం జరిగింది.

ప్రమాదాలకు ప్రధాన కారణాలు ఏంటి?

అతివేగం ,నిర్లక్ష్యపు డ్రైవింగ్, మద్యం మత్తులో, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపటం, హెల్మెట్ ధరించక పోవడం, డ్రైవింగ్ పట్ల, ట్రాఫిక్ నిబంధన పట్ల సరైన అవగాహన లేని వ్యక్తులు, మైనర్లు వాహనాలు నడిపినపుడు అధిక శాతం ప్రమాదాలు జరుగుతున్నాయి. పల్నాడు జిల్లాలో 2021-24 కాలం మధ్య జరిగిన ప్రమాదాల సంఖ్య గమనిస్తే కొంతమేర తగ్గుముఖం పట్టినట్లు నివేదికను సూచిస్తున్నాయి.

పాఠశాలలు, కళాశాలల బస్సులు నిబంధనలు పాటించడం లేదని ఆరోపణలకు మీ సమాధానం?

పల్నాడు జిల్లాలో వివిధ వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన 600 లకు పైగా ఉన్న బస్సులపై ఎప్పటికప్పుడు సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. డ్రైవర్లకు కంటి కంటి చూపు సామర్థ్యం, ఆరోగ్య, మానసిక పరిస్థితిలపై పరీక్షలు నిర్వహించి ప్రమాదాల నివారణకు శిక్షణ ఇస్తున్నాం. కళ్ళజోళ్ళు అవసరమైన 78 మంది డ్రైవర్లకు దాతల సహాయంతో ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ చేశాం. నిబంధనలు పాటించని వివిధ పాఠశాలలు, కళాశాలకు చెందిన 40 బస్సులపై కేసులు నమోదు చేసి రూ 2 లక్షల మేర జరిమానాలు విధించాం. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రయివేటు ట్రావెల్స్ బస్సు కు రూ 7.50 లక్షల జరిమానా విధించగా కోర్టు ద్వారా రూ 4 లక్షలు చెల్లించారు. పరిమితికి మించి ప్రయాణికులను, వ్యవసాయ కూలీలను తరలిస్తున్న 50 ఆటోలు, 4 ట్రాక్టర్ లపై కేసులు నమోదు చేశాం.

కొత్త వాహన రిజిస్ట్రేషన్, లైసెన్స్ జారీ ప్రక్రియ గురించి?

నూతన వాహనం కొనుగోలు చేసిన వారు రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొత్తం ఆన్లైన్‌లో అవకాశం ఉంది. పల్నాడు జిల్లాలో నరసరావుపేట, మాచర్ల, చిలకలూరిపేట, పిడుగురాళ్లలో యూనిట్ కార్యాలయాలు ఉన్నాయి. లైసెన్స్, రిజిస్ట్రేషన్ జారీ ప్రక్రియ అంతా సజావుగా సాగుతుంది. ఇప్పటి వరకు ఎలాంటి సమస్య లేదు. డ్రైవింగ్ పరీక్షలలో భాగంగా లైసెన్సులు తీసుకునే వారికి నిబంధనలు ప్రకారం ట్రాఫిక్ నిబంధనలపై పరీక్ష, వాహనం నడిపే తీరు క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం లైసెన్స్ మంజూరు చేస్తున్నాం.

ప్రమాదాల నివారణకు వాహనదారులకు మీరిచ్చే సందేశం ?

రోడ్డు ప్రమాదం అంటే ఒక వాహనం రోడ్డుపై పడడం కాదు. వాహనాలు నడిపే వ్యక్తుల కుటుంబాలు రోడ్డున పడుతున్నట్లు గుర్తించాలి. ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత. వాహనదారుడు చేసే తప్పిదాలు వాహనదారునితో పాటు ఎదుటి వారి ప్రాణాలకు ముప్పు తెస్తుందనే సంగతిని గుర్తుంచుకోవాలి. కుటుంబ పెద్దను కోల్పోతే ఏర్పడే లోటు ఆ కుటుంబానికి ఎవరు తీర్చ లేనిది. వాహనం నడిపేటప్పుడు ఏమరపాటు, నిర్లక్ష్యం వీడి అప్రమత్తంగా ఉండాలి. రోడ్డు నిబంధనలు పాటించాలి. ద్విచక్ర వాహనంపై ఇద్దరు కంటే ఎక్కువ మంది ప్రయాణం చేయరాదు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించే ఇరువురు హెల్మెట్ ధరించడం కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్ పెట్టుకోవడం శ్రేయస్కరం.

(ప్రజాశక్తి-పల్నాడు జిల్లా)